News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :5 | ఖమ్మం | ఆదివారం ఫిబ్రవరి 23, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



# ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో ప్రమాదం

**10 మందికిపైగా కూలీలకు గాయాలు**

**22 మంది సేఫ్.. 8 మంది మిస్సింగ్**

వివరాలు 2లో..

## 3 మీటర్ల వరకు కుంగిన పైకప్పు

- రిటైనింగ్ వాల్ కడుతుండగా ఘటన
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఘటన
- స్పాట్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## టన్నెల్‌లో 8 మంది

కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
సమీక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్, జూపల్లి



దోమలపెంటలోని ఎస్ఎల్బీసీ ప్రమాద స్థలి వద్ద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- తక్షణ సహాయ చర్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ముఖ్యమంత్రికి ప్రధాని ఫోన్.. సహకారానికి హామీ
- న్డీఆర్ఎఫ్ బృందాలను పంపిన కేంద్రం
- సైన్యాన్నీ రంగంలోకి దింపేందుకు సన్నాహాలు

# పారదర్శకంగా బీసీ కులగణన

**తప్పులుంటే చెప్పాలంటున్నం**

**నాపైన ఎంతో ఒత్తిడి ఉంది.. దేశంలో ఏ సీఎం చేయలేని సాహసం చేస్తున్నా: సీఎం రేవంత్**

- మిస్సయిన వాళ్లకోసం మళ్లీ చేస్తున్నం
- నిర్వీర్యం చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర
- కేసీఆర్ ఫ్యామిలీ జనాభా లెక్కల్లో లేదు



- 70 జాతుల ముస్లింలను ఓబీసీలో కలిపిందే మోదీ
- పనిచేసే నన్ను విలన్ అంటున్రు.. ఫాం హౌస్ లో పన్నోడిని హీరో అంటున్నరు
- మార్చి 10 లోపు రాష్ట్ర వ్యాప్తంగా కుల సంఘాలు మీటింగ్స్ పెట్టాలె
- అన్ని కులాల వాళ్లూ బాధ్యత తీసుకోవాలి
- యూనివర్సిటీల్లోనూ మీటింగ్స్ పెట్టాలని మేధావులను కోరుతున్నా
- కులగణన మెగా హెల్త్ చెకప్
- అసెంబ్లీలో తీర్మానం చేస్తే నా బాధ్యత పూర్తి

వివరాలు 2లో..

# రేపు సీఎం రేవంత్ బహిరంగ సభ



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలన్నారర మంత్రి పొన్నం ప్రభాకర్. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎన్నికల ప్రచారలో భాగంగా ఫిబ్రవరి 24 న SRR కళాశాలలో మైదానంలో సీఎం బహిరంగ సభ ఉంటుందన్నారు పొన్నం. కరీంనగర్ జిల్లా అభివృద్ధికి తాము ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు రాబోతున్నాయని చెప్పారు. బండి సంజయ్ కాంగ్రెస్ ను బద్నామ్ చేస్తున్నారని మండిపడ్డారు పొన్నం. ఆయనకు పట్టభద్రుల ఎన్నికల్లో ఓటే లేదన్నారు. ఆరేళ్లలో తెలంగాణకు ఎన్ని నిధులు

వివరాలు 2లో..

# గ్రూప్ 2 పరీక్షలు యథాతథం

ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 పరీక్షలు ఫిబ్రవరి 23న యథాతథంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఇటీవల ఈ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వచ్చిన వార్తలపై ఏపీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. కమిషన్ తెలిపిన ప్రకారం, ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలను తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర వివరాలను అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో చూసుకోవాలని

వివరాలు 2లో..




# ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు..

**జగన్ హాజరయ్యే అవకాశం!**




- మరో రెండ్రోజుల్లో ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- జగన్, ఇతర వైసీపీ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దయ్యే ప్రమాదం
- అసెంబ్లీకి ఒకరోజు వచ్చి వెళ్లిపోయే ఆలోచనలో జగన్, ఇతర వైసీపీ ఎమ్మెల్యేలు

వివరాలు 2లో..

# బీఆర్ఎస్‌లో చేరడం లేదు..!

**రేవంత్ రెడ్డిని కలిసిన అనంతరం కోనేరు కోనప్ప**



- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు నిన్న ప్రచారం
- బీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు జరిగిన ప్రచారాన్ని ఖండించిన కోనేరు కోనప్ప
- చివరి వరకూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టీకరణ

వివరాలు 2లో..

# కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుందని రేవంత్ రెడ్డికి భయం

- కృష్ణా జలాల విషయంలో ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని విమర్శ
- రేవంత్ రెడ్డి 'ఆర్' ట్యాక్స్‌పై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సవాల్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్న

వివరాలు 2లో..



# రాష్ట్రంలో వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు

- నెల్లూరు జిల్లాలో మంత్రి నాదెండ్ల పర్యటన
- సంగంలో రైసుమిల్లు, జెండా దిబ్బలో స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేసిన మంత్రి
- క్యూఆర్ కోడ్ తో కూడిన రేషన్ కార్డులు ఇస్తామని వెల్లడి

రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ రేషన్ కార్డులు ఆధునిక టెక్నాలజీతో క్యూ ఆర్ కోడ్ లను కలిగి ఉంటాయని తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ ఇవాళ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వివరాలు 2లో..



# బీజేపీలో ఎవరైనా అధ్యక్షుడు కావచ్చు



తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై కేంద్రమంత్రి, టీబీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాదిరిగా కాకుండా బీజేపీలో ఎవరైనా అధ్యక్షుడు కావచ్చని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం (ఫిబ్రవరి 22) కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపని ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

# పారదర్శకంగా బీసీ కులగణన

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో కులగణన చేపట్టామని, పారదర్శకంగా సర్వే నిర్వహించామని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీ సంఘాలది, పార్టీ బీసీ నేతలది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ బీసీ సంఘాల నాయకులు, పార్టీ బీసీ నేతలు, కార్పొరేషన్ల చైర్మన్లతో ప్రజాభవన్ లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సర్వే తప్పు తప్పంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారని, ఎక్కడ తప్పుందో చెప్పాలని అన్నారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిచి నాలుగు కేటగిరీలుగా చూపారని, తాము ఐదు కేటగిరీలుగా ఇచ్చామని, ముస్లింలను తాము ప్రత్యేకంగా జాబితాలో చేర్చలేదని, వాళ్లు ఎప్పటి నుంచో ఉన్నారని సీఎం క్లారిటీ ఇచ్చారు. బీసీ నేతలు కులగణనపై అవగాహన చేసుకోవాలని అన్నారు. ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దని చెప్పారు. బీసీలు నిలదీస్తే.. తమ పదవులు పోతాయని బీజేపీ, బీఆర్ఎస్‌లో రెండు వర్గాల వారు కుట్ర చేస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి కొస్తే కులగణన చేస్తామని రాహుల్ గాంధీ మాటిచ్చారని, బలహీన వర్గాలు ముందుకొచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని, తమ నాయకుడు ఇచ్చిన మాటను నిలబెట్టేందుకే కులగణన చేపట్టామని సీఎం అన్నారు.

**కేసీఆర్ కాకిలెక్కలు**

కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే పేరుతో కాకిలెక్కలు చెప్పారని సీఎం అన్నారు. ఎస్సీల్లో 56 కులాలు ఉంటే 86 కులాలుగా సమగ్ర కుటుంబ సర్వేలో చూపించారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కోర్టుల్లో కేసులు వేసి కులగణన ప్రక్రియను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని గ్రహించే జాగ్రత్తగా సర్వే చేశామని, మిగిలిపోయిన కుటుంబాల వాళ్లు నమోదు చేసుకునేందుకు వీలుగా ఈ నెల 28 వరకు అవకాశం కల్పించామని, టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చామని, ఆన్ లైన్ లో నమోదుకు అవకాశం కల్పించామని సీఎం వివరించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఫ్యామిలీలు జనాభా లెక్కల్లోనే లేవని అన్నారు. పనిచేస్తున్న తనను విలన్ అని, ఫాం హౌస్ లో పండుకున్నోడిని హీరో అనడం విడ్డూరంగా ఉందని సీఎం అన్నారు.

**మార్చి 10 లోపు మీటింగ్స్ పెట్టాలె**

కులగణన చరిత్రాత్మకమని, బీహార్, హర్యానా రాష్ట్రాలకు పంపి అక్కడి కులగణను స్టడీ చేసి మెరుగైన విధానాన్ని ఎంచుకొని చేపట్టామని, ఒక్కో ఎన్యూమరేటర్ 150 ఇండ్లలో సర్వే చేశారని, పూర్తి పారదర్శకంగా చేశామని సీఎం వివరించారు. కులగణన కోసం ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ వేశామని వివరించారు. 160 కోట్లు ఖర్చు చేసి యాభై రోజుల పాటు సర్వే చేశామని వివరించారు. మొత్తం కోటీ 12 లక్షల కుటుంబాలు సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నాయని అన్నారు. ఇప్పుడు తెలంగాణ జనాభా నాలుగు కోట్లు అని చెబుతున్నారని అన్నారు. తాము సేకరించిన ఆధారాలన్నీ ఉన్నాయని, వాటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం వివరించారు. కులగణనపై అన్ని కుల సంఘాలు మీటింగ్స్ పెట్టాలని, చరిత్రాత్మకమని తమతమ కులాల వారికి వివరించాని సీఎం కోరారు. మార్చి 10 లోపు పార్టీ బీసీ నాయకులంతా ఈ సమావేశాలపై దృష్టి పెట్టి పూర్తి చేయాలని అన్నారు.

**బీసీలు 56.33 శాతం**

తమ లెక్కల ప్రకారం బీసీలు 56.33 శాతం ఉన్నారని సీఎం చెప్పారు. కేసీఆర్ చెప్పిన కాకిలెక్కల ప్రకారం.. బీసీలు 51% అని, ఎస్సీలు 18%, ఎస్టీ 10%, ఓసీలు12% అని అన్నారు. ఆ లెక్కన బీసీల శాతం పెరిగినట్టేనని, తాము ఐదు కేటగిరీలుగా చూపితే కేసీఆర్ తన కాకి లెక్కలో నాలుగు కేటగిరీలుగా చూపారని వివరించారు. గతంలో సాక్షాత్తూ ప్రధాని మోదీ 70 జాతుల ముస్లిం లను ఓబీసీ లో కలిపారని అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా సీఎం వినిపించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు.

**నామీద ఒత్తిడి మీకు కనపడదు**

కులగణనపై తన మీద ఎంతో ఒత్తిడి ఉందని, అది ఎవరికీ కనిపించదని, నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి పూర్తి చేశామని సీఎం చెప్పారు. భవిష్యత్ లో కులగణన గురించి ఎవరైనా మాట్లాడాల్సి వస్తే తెలంగాణే రోల్ మోడల్ అవుతుందని అన్నారు. తానే స్వయంగా కులగణనపై 12 సార్లు రివ్యూ చేశానని వివరించారు. అసెంబ్లీలో తీర్మానం చెయిస్తే తన పని అయిపోతుందని రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో అనేక సమావేశాలు పెట్టామన్నారు. కులగణనపై ముందుకు వెళితే నష్టం జరుగుతుందని భావించే బీజేపీ కొత్త వివాదాలను తెరపైకి తెస్తోందన్నారు. కులగణన విషయంలో కేంద్రంపై దేశ వ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతోందని అన్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కూలిన పైకప్పు

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ మార్గంలో ఘోరం జరిగింది. టన్నెల్ లోపల కార్మికులు పనుల్లో నిమగ్నమవుతున్న సమయంలో 14వ కిలోమీటరు వద్ద పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రమాదంలో సొరంగం లోపల ఎనిమిది మంది చిక్కుకోగా.. పలువురు త్రుటిలో తప్పించుకుని, ప్రాణాలతో బయటపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ సొరంగంలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సొరంగంలో చిక్కుకున్న వారిని వేగంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయ చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ సీఎం రేవంత్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. సహకారానికి కేంద్రం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించారు. సికింద్రాబాద్ నుంచి ఆర్మీ ఇంజినీర్లను సిద్ధం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా ఈ ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేశారు.

మొదటి షిఫ్టులో ఉదయం 8.30 గంటలకు దాదాపు 40 మంది వరకు సొరంగంలోని పని ప్రదేశానికి చేరుకుని పనులకు సిద్ధమవుతుండగానే ఈ ఘటన చోటుచేసుకుంది. సొరంగ మార్గంలోని 14వ కిలోమీటరు వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో పనులు జరుగుతున్నాయి. అక్కడ కొన్నాళ్లుగా పైకప్పు నుంచి లీకేజీలు ఉన్నాయి. శనివారం నీటి లీకేజీలు కొనసాగుతుండగా మట్టి కూడా ఉబికి రావడంతో పైకప్పు కాంక్రీట్ సెగ్మెంట్స్ ఒక్కసారిగా కుప్పకూలాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పని ప్రదేశం నుంచి వెనక్కి దాదాపు 10 సీసీ బ్లాకులు కూలిపోవడంతో 100 మీటర్ల మేర నీరు, మట్టి కూరుకుపోయింది. టీబీఎంకు సమీపంలో పనులు చేస్తున్న జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్, రాబిన్‌సన్ కంపెనీకి చెందిన ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు అందులో చిక్కుకుపోయారని ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. మిగతా 32 మంది వరకు కార్మికులు, టెక్నీషియన్లు బయటకు వచ్చారు.

**పరిగెత్తి.. ప్రాణాలు కాపాడుకుని..**

దాదాపు నాలుగేళ్ల తర్వాత ఈ నెల 18న తిరిగి పనులు ప్రారంభించారు. పనులు ఆరంభమైన నాలుగో రోజే ఈ దుర్ఘటన జరిగింది. శనివారం ఉదయం 7.30 గంటలకు లోకో ట్రైన్ ద్వారా సొరంగ మార్గంలోకి వెళ్లారు. పనుల్లో నిమగ్నమైన కొద్దిసేపటికే పైకప్పు కూలిపోవడంతోపాటు.. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో చీకటి అలముకుంది. దీంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు కాపాడుకునేందుకు సొరంగ మార్గంలో పరుగులు తీసుకుంటూ బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. నీటిమట్టం పెరుగుతుండటంతో పక్కనే ఉన్న కన్వేయర్ బెల్టు ఎక్కి కొద్దిదూరంలో ఉన్న లోకో ట్రైన్‌ను చేరుకుని అక్కడి నుంచి బయటకు వచ్చారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు వారిని వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఎవరికీ పెద్దగా గాయాలు కాలేదు. కాని భయభ్రాంతులకు గురయ్యారు.

**అప్రమత్తమైన యంత్రాంగం**

ప్రమాద సమాచారం తెలియగానే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్, కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు వెంటనే అక్కడికి చేరుకుని ఇంజినీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ హుటాహుటిన బయలుదేరారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా అక్కడికి చేరుకున్నారు. అందరూ కలిసి పరిస్థితులను సమీక్షించారు. నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ తదితరులు కూడా వచ్చి పరిశీలించారు. నీటిపారుదలశాఖ సీఈ అజయ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి సొరంగం వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి జాతీయ విపత్తుల నిర్వహణ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సొరంగం లోపలికి వెళ్లడానికి ఉన్న అవకాశాలపై చర్చలు చేపట్టాయి.

**భూ ఉపరితలం పై నుంచి రంధ్రాలకు యత్నాలు**

దోమలపెంట నుంచి ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ 14వ కిలోమీటరు వద్ద ప్రస్తుతం భూగర్భంలో పనులు జరుగుతున్నాయి. భూమి ఉపరితలం నుంచి కొంతకాలంగా పీయూ కెమికల్ గ్రౌటింగ్‌ను భూమిలోనికి పంపుతూ నీటి ఊటను నియంత్రించేందుకు ఇంజినీర్లు ప్రయత్నిస్తున్నారు. దీని కోసం అమెరికాకు చెందిన నిపుణుల సలహాలు కూడా తీసుకున్నారు. సొరంగం లోపల భాగంలో మట్టి కుంగిన ప్రాంతం ఎక్కడ ఉందనేది ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. శనివారం రాత్రికి సొరంగంలోకి వెళ్లే ప్రయత్నాలు కొనసాగిస్తూనే భూ ఉపరితలం నుంచి లోపలకు రంధ్రాలు చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నట్లు సీఈ అజయ్‌కుమార్ వెల్లడించారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూ ఉపరితలంపై నుంచి సొరంగం ఎక్కడ ఉందో గుర్తించే పనిని అటవీశాఖ అధికారులు చేపట్టారు.

**సొరంగం నుంచి బయటకు తోడిన నీరు వరదలో చెల్లాచెదురు**

సొరంగంలో పనులు జరుగుతున్న ప్రాంతం బయటి నుంచి 14 కి.మీ. దూరంలో ఉంది. ఐదేళ్లుగా పనులు జరుగుతున్న చోట పైనుంచి నీటి ఊట వస్తోంది. ఇటీవలే కొంత తగ్గడంతో ఇంజినీర్లు, కార్మికులు పనుల్లో వేగం పెంచారు. ఊట పెరుగుతోందని భావించారే గానీ ఒక్కసారిగా పైకప్పు కూలుతుందని ఊహించలేదు. పెద్ద ఎత్తున మట్టితో కూడిన వరద వచ్చింది. దీంతో టన్నెల్ బోరింగ్ యంత్రంవద్ద ఉన్న కొందరు, సిమెంటు సెగ్మెంట్లు అమర్చే ప్రాంతంలోని మరికొందరు వరదలో చెల్లాచెదురయ్యారు. దీనికితోడు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం షిఫ్ట్‌లో భాగంగా 40 మంది వరకు కార్మికులు, ఎలక్ట్రికల్, మెకానికల్, టన్నెల్ బోరింగ్ యంత్రం సిబ్బంది, సిమెంట్, కాంక్రీట్ వర్కర్లు సొరంగంలోకి వెళ్లారు.

**చిక్కుకున్నది వీరే..**

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి వివరాలిలా ఉన్నాయి. జేపీ సంస్థకు చెందిన మనోజ్‌కుమార్ (పీఈ), శ్రీనివాస్ (ఎస్ఈ), రోజువారీ కార్మికులు సందీప్‌సాహు (28), జక్తాజెస్ (37), సంతోష్‌సాహు (37), అనూజ్ సాహు (25) ఉన్నారు. రాబిన్‌సన్ సంస్థకు చెందిన ఆపరేటర్లు సన్నీ సింగ్ (35), గురుదీప్ సింగ్ (40) సొరంగం లోపల విధుల్లో ఉన్నారు. జమ్మూ, పంజాబ్, ఝార ండ్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాల నుంచి వచ్చిన వీరు సొరంగంలో కొంతకాలంగా పని చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. బయటపడిన వారు కూడా ఆయా ప్రాంతాలకు చెందిన వారే.

# గ్రూప్ 2 పరీక్షలు యథాతథం

- మొదటి పేజి తరువాయి

కమిషన్ తెలిపింది. ఏపీపీఎస్సీ తెలిపిన ప్రకారం ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున, ఈ సమయంలో గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కమిషన్ పేర్కొంది. ఈ కోడ్ ప్రకారం ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పరీక్షలు వాయిదా వేయడం వంటి చర్యలు తీసుకోవడం నిషిద్ధం. అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయడం సాధ్యం కాదని కమిషన్ స్పష్టం చేసింది. ఈ ప్రకటనపై గ్రూప్ 2 అభ్యర్థులు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. ఈ ఎగ్జామ్ కోసం ప్రిపేర్ అయిన అభ్యర్థులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, సరిగా ప్రిపేర్ కానీ వారు మాత్రం నిరాశపడుతున్నారు.

గ్రూప్ 2 పరీక్షలు ఏపీ వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నిర్వహించబడనున్నాయి. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో ఉన్న సమాచారం ఆధారంగా తమ పరీక్షా కేంద్రాలను చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి చేరుకోవాలని, అవసరమైన పత్రాలను కూడా తీసుకురావాలని కమిషన్ ఈ సందర్భంగా సూచించింది. ఏపీపీఎస్సీ అభ్యర్థుల పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలైనా ఉంటే, వారు కమిషన్ అధికారిక నంబర్ లేదా ఇమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది.

ఈ నేపథ్యంలో శనివారం జరిగే గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షల కోసం అభ్యర్థులు తమ సన్నాహాలను పూర్తి చేసుకోవాలని కమిషన్ సూచనలు జారీ చేసింది. పరీక్షకు హాజరయ్యే సమయంలో నిబంధనలను పాటించాలని సూచించింది. మరోవైపు ఏపీపీఎస్సీ ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది.

# బీజేపీలో ఎవరైనా అధ్యక్షుడు కావచ్చు

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్ని స్థానాల్లో పోటీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నాయని ఎద్దేవా చేశారు. అలాగే.. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్ పైన కిషన్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాక.. కాంగ్రెస్ పాలనపై సీఎం రేవంత్ ఛాలెంజ్ విసిరితే బాగుండేదన్నారు. అన్ని రంగాల్లో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. పాలనపై సీఎం రేవంత్ ఛాలెంజ్ విసరడం హాస్యాస్పదమని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని.. సీఎం రేవంత్ రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. ఇక, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు, టీచర్లు ఆలోచించి ఓటేయాలని.. తెలంగాణ భవిష్యత్తుకు ఈ మండలి ఎన్నికలు దిశానిర్దేశం చేయనున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత సంస్థాగత ఎన్నికల మీద దృష్టి పెడతామని క్లారిటీ ఇచ్చారు.

# బీఆర్ఎస్‌లో చేరడం లేదు..!

సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం ఆయన పార్టీ మార్పుపై వివరణ ఇచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు జరిగిన ప్రచారాన్ని ఖండించారు. తాను చివరి వరకూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని అన్నారు.కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు నిన్న జోరుగా ప్రచారం సాగింది. అయితే, ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.కోనేరు కోనప్ప 2014 ఎన్నికల్లో బీఎస్పీ నుండి పోటీ చేసి నాటి బీఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై విజయం సాధించారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో మరోసారి బీఆర్ఎస్ నుండి పోటీ చేసి గెలిచారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్ చేతిలో ఓడిపోయారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌లో చేరడంతో కోనేరు కోనప్ప అసంతృప్తితో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## రేపు సీఎం రేవంత్ బహిరంగ సభ

- మొదటి పేజి తరువాయి

తీసుకొచ్చారో చెప్పి బండి సంజయ్ ఓట్లు అడగాలన్నారు.

బీసీ రిజర్వేషన్ పై తెలంగాణ అసెంబ్లీలో చట్టం చేసిన తర్వాత కేంద్రంలో బిల్లు తెచ్చే బాధ్యత కేంద్రానిదేనన్నారు. ఈబీసీ వాళ్ళు కూడా బీసీనే..అందులో ముస్లింలు లేరా? అని ప్రశ్నించారు. ప్రతీది రాజకీయం చేయొద్దన్నారు పొన్నం. 15 శాతం కమిషన్ తీసుకుంటున్నారని బండి సంజయ్ తమపై చేసిన ఆరోపణలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారో ముందు బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ అభ్యర్థి అంజి రెడ్డికి 30కోట్లు ఇచ్చామని చెబుతున్నారు..పైసలు ఇస్తే తీసుకొని కాంగ్రెస్ కి ఓటు వెయ్యాలన్నారు పొన్నం.

# ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు..

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజున రాష్ట్ర గవర్నర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. బీఏసీ సమావేశం అనంతరం, ఈసారి అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరుగుతాయన్న అంశంపై స్పష్టత రానుంది. కాగా, ఈసారి వైసీపీ అధినేత జగన్ తో పాటు, ఆ పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలు కూడా అసెంబ్లీకి హాజరవుతారని తెలుస్తోంది. ఎందుకంటే... వరుసగా 60 పనిదినాల పాటు అసెంబ్లీకి హాజరుకాకపోతే, సదరు ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడుతుందని ఇటీవలే ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఓ ప్రెస్ మీట్ లో చెప్పారు. ఆ లెక్కన జగన్ కు అనర్హత ముప్పు పొంచి ఉందని సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో, శాసనసభ సభ్యత్వాలు రద్దయ్యే ప్రమాదం ఉండడంతో... జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు ఒక రోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరై వెళ్లిపోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

# కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుందని రేవంత్ రెడ్డికి భయం

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తే తన ఉద్యోగం పోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కేవలం ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడతామని ఆయన అన్నారు. గతంలో కేసీఆర్ నల్గొండలో ధర్నా చేసిన తర్వాతనే అసెంబ్లీలో ఈ అంశంపై తీర్మానం చేశారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణలో 'ఆర్' ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి చేతనైతే 'ఆర్' ట్యాక్స్‌పై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. ఆయన బీజేపీలో చేరతారని లోపాయికారి ఒప్పందం ఏమైనా ఉందా? అని నిలదీశారు. అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది అక్రమాలకు పాల్పడ్డాడని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు చేసిందని, అయినప్పటికీ చర్యలు లేవని విమర్శించారు. సుంకిశాల ప్రమాదంలో కూడా రేవంత్ రెడ్డి ఎవరిని కాపాడుతున్నారో తెలుసని కేటీఆర్ అన్నారు.

# రాష్ట్రంలో వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా సంగం సమీపంలోని రైసుమిల్లును, జెండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి తనిఖీ చేశారు. రైసుమిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెండా దిబ్బ వద్ద స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి స్టాకు వివరాలు, సరఫరా మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. మహిళలందరూ కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులను అందిస్తామని చెప్పారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం-2 పథకం హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా ఈ జిల్లాలో 4 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 93.42 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మహిళలందరూ తెలుసుకోవాలని, భాగస్వామ్యం కావాలని సూచించారు. మే నెల నుంచి అన్ని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం మంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు.

# శవాల దహనం ఒక వైపు - వ్యర్థాలు కాల్చివేత మరోవైపు

(సికె న్యూస్) దమ్మపేట ప్రతినిధి . వెంకటేశ్వర్లు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట గ్రామపంచాయతీలో హిందూ స్మశాన వాటిక ప్రక్కనే డంపింగ్ యార్డ్ నిర్మించడం వల్ల శవదహనానికి వచ్చే వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. మనిషి జీవిత ప్రయాణంలో చివరి స్థానమైన స్మశాన వాటిక వద్ద అసౌకర్యం ఎదుర్కోక తప్పడం లేదు. శవ దహనానికి ముందే వ్యర్థాల దహనములతో వచ్చే పొగ శవ దహనానికి వచ్చిన వారిని ఇబ్బంది పెడుతోంది.

1998-1999 సంవత్సరంల మధ్యకాలంలో శవదహనాలకు స్థలం దొరక ఇబ్బందులు పడుతున్నప్పుడు ధార మల్లికార్జున రావు గారు నేతృత్వంలోని వాసవి క్లబ్ స్థల సేకరణకు కృషి చేసి అప్పటి రెవిన్యూ శాఖను ఒప్పించి ధమ్మపేట నుండి అచ్చుతాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో రెండు ఎకరాల స్థలాన్ని సాధించింది. ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నీటి తొట్టి నిర్మించడంతో పాటు పంచాయతీనీ ఒప్పించి నీటి సౌకర్యం కల్పించింది.

%దీ.=.ూ% ప్రభుత్వం వచ్చాక ప్రతి పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డులు నిర్మించాలని నిర్ణయించడంతో ధమ్మపేట పంచాయతీ డంపింగ్ యార్డ్ కు కొత్త స్థలం సేకరించకుండానే ఆ స్మశాన వాటికలో కొంత భాగం ఆక్రమించి డంపింగ్ యార్డ్ ని ఏర్పాటు చేసింది. జంతు



కళేబరాలు ,వ్యర్థాల కాల్చివేత వాసన శవాల దహనానికి వచ్చే వారినీ, బంధుమిత్రులనీ ఇబ్బంది పెడుతోంది.

ఇది ఇలా ఉండగా మరో స్మశాన వాటిక పరిస్థితి కూడా ఇంతే ఎలా ఉంది

దమ్మపేట నుండి మల్కారం వెళ్లే రోడ్డు లో ఉన్న 90 ఏళ్ల నాటి చిన్న స్మశాన వాటిక కూడా వ్యర్థాలతో నుండి కుదించక పోతుంది.

ఈశ్వరప్రగాఢ లక్ష్మణరావు అనే వ్యక్తి ఈ స్థలాన్ని పూర్వం స్మశాన వాటిక కోసం దానం చేశారు , ఈ స్మశాన వాటిక ఆర్ అండ్ బి రోడ్డు వెడల్పులో విస్తీర్ణం తగ్గింది , కావున పంచాయతీ వారు స్థలాన్ని కాపాడి సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# మరణించిన వ్యక్తి కుటుంబానికి సహాయం అందజేసిన వెంకట్ రెడ్డి



ఫిబ్రవరి 23 (సికె న్యూస్) చేగుంట:చేగుంట మండలం బి కొండాపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన బేగరి సత్తవ్వ కుటుంబానికి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అదజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జోగామ్మగారి వెంకట్ రెడ్డి

బేగరి నర్సింలు తల్లి బేగరి సత్తవ్వ ఇటీవల కాలంలో మరణించిన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జోగామ్మగారి వెంకట్ రెడ్డి 50 కిలోల బియ్యాన్ని ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ బేగరి రమేష్, పాలేటి నాగరాజు, గడ్డం బాలరాజు, పెద్దపోత చెంద్రం, బేగరి యాదయ్య, బేగరి ఎల్లం, బేగరి ప్రశాంత్, బేగరి సంజీవ్, మరియూ తదితరులు పాల్గొన్నారు..

# ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ), ఫిబ్రవరి 22,

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సిబ్బందికి సూచించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఫిబ్రవరి 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పిఓ, ఏపీఓలకు రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల ముందు రోజే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అక్కడ తమకి కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎలక్షన్ సామాగ్రి అన్ని పరిశీలించుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 26వ తేదీన ఉదయం కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉంటుందని, ఆరోజు అందరూ విధిగా సమయపాలన పాటించి మీకు సంబంధించినటువంటి పోలింగ్ సామాగ్రిని తీసుకొని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లవలసిందిగా ఆదేశించారు. ఫిబ్రవరి 27 ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలియజేయడం, క్రాస్ చెక్ చేసుకోవటం, నాలుగు గంటలకు ఆఖరి ఓటర్ ఓటు వేసిన తర్వాత బాక్సులు అన్నీ సీల్ చేసి నేరుగా నల్గొండ కలెక్టరేట్ కు అందజేయాలని తెలిపారు. పోలింగ్ అధికారులు అందరూ బాధ్యతగా ఎన్నికల విధులను ప్రశాంతమైన వాతావరణంలో రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపర్డెంట్ లు దార ప్రసాద్, రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనీ పూసపాటి సాయి కృష్ణ, కిరణ్ కుమార్, అశోక్ మరియు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జాతీయ మాతృ భాష దినోత్సవం జరిపిన తెలంగాణ సాహితీ.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 22,స్థానిక గ్రంథాలయం నందు అంతర్ జాతీయ మాతృ భాష దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక కవులు మాతృ భాష విశిష్టత తెలుగు గొప్పదనం తెలుగు రచనలు గురించి ప్రసంగించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులు గా నాగ లక్ష్మీ సెక్రటరీ ముఖ్య అతిధులుగా హరిత మిత్ర లయన్ డాక్టర్ గోళ్ల భూపతి రావు, ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ మరియు జెట్టి లలిత హాజరైనారు. ఈ సందర్భంగా గా ప్రముఖులు మాట్లాడుతూ తెలుగు రచనలు తెలుగు భాష దినోత్సవం గిడుగు రామ మూర్తి సేవలు తెలుగు తీయదనం గురించి ప్రసంగించారు , కవుల కవితలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో జాని గ్రంథాలయ పాలకులు, విజయ గోపాల్, రాళ్ళబండి రాజు, నాగేంద్ర ప్రసాద్, ఉమ, సోమశేఖర్, రామ రాజు , లాయర్ వైదుల వేంకటేశ్వర్లు, కోటేశ్, రావు ,జె. మూర్తి, శ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పదును ...!

- ఆదివారం ప్రతిభ ప్రోత్సాహక పరీక్ష.
- హాజరుకానున్న 335 మంది 'టెన్త్' గిరిబిడ్డలు.
- ఓఎంఆర్ విధానంలో ఆన్సర్ షీట్.
- పరీక్షలో టాపర్స్ కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.
- పిఓ రాహుల్ వినూత్న ప్రయోగం.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఫిబ్రవరి 22,గిరిజన విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుదలకు రకరకాల ప్రయోగాలు చేస్తున్న భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ మరో నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో టెన్త్ చదువుతున్న గిరిజన బాల,బాలికలను విద్యలో మరింత ప్రోత్సహించి వారిని ఉన్నత రంగాల వైపు నడిపించేందుకు ఐటిడిఏ పిఓ ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 55 ఆశ్రమ పాఠశాలలు,12 గిరిజన గురుకులాలకు చెందిన 335 మంది టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులు ఆదివారం నిర్వహిస్తున్న ఈ ప్రతిభా ప్రోత్సాహక పరీక్షకు హాజరవుతున్నారు. ఇందు కోసం ఏజిహెచ్ఎస్ భద్రాచలం, ఏహెచ్ఎస్ పాల్వంచ, ఏజిహెచ్ఎస్ అంకంపాలెం, ఏ హెచ్ ఎస్ బుజ్జి గూడెం, ఏజీహెచ్ఎస్ ఖమ్మం తదితర ఐదు పరీక్ష కేంద్రాల్లో ప్రతిభా ప్రోత్సాహక పరీక్షను నిర్వహిస్తున్నారు. 150 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. ఆరు సబ్జెక్టులలో ప్రతి సబ్జెక్టుకు 25 మార్కులు కేటాయిస్తున్నారు. ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష విధానం ఉంటుంది. ఓఎంఆర్ షీట్ లలో ఆన్సర్లు బబ్లింగ్ చేయాలి.

**ఐటీడీఏ పీవో రాహుల్ మరో వినూత్న ప్రయోగం :**

భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ ఐఏఎస్ ఇప్పటికే గిరిజన విద్యా సంస్థల్లో అనేక ప్రయోగాత్మక విద్యాసంవత్సరాలను చేపట్టారు. ఇవన్నీ దాదాపు సత్ఫలితాలను ఇచ్చాయని చెప్పవచ్చు. విద్య అభ్యసన ప్రక్రియలో ఉద్దీపనం, పుస్తకం బాల బాలికలకు అందుబాటులో తెచ్చి విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేశారు. తెలుగు భాష, మాతృభాష పై పట్టు సాధించేందుకు అనేక టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. తాజాగా కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం ద్వారా పిల్లల విద్యా పరిణితి, ఉద్యోగ ఉపాధి అవకాశాల పై అవగాహన కల్పించే పనికి పూనుకున్న విషయం విధితమే. ఈ క్రమంలో మరో వినూత్న ప్రయోగానికి వివో రాహుల్ శ్రీకారం చుట్టి గిరిజన విద్యా సంస్థల్లో టెన్త్ లో టాపర్స్ కు ఐటీడీఏ అండగా నిలిచే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఇందు కోసం పిఓ రాహుల్ కసరత్తులు చేశారు. పదవ తరగతి చదువుతున్న బాలబాలికలకు పరీక్ష పెట్టి వారిలో మెరుగైన పిల్లలను ప్రతి పాఠశాలకు ఐదుగురు చొప్పున ఎంపిక చేసి వారికి ప్రత్యేక తర్ఫీదు ఇప్పించారు. ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాల్లో 335 మంది బాలబాలికలను ఎంపిక చేసి ప్రతిభ ప్రోత్సాహక పరీక్షల్లో టాపర్స్ ను గుర్తించి వారికి ప్రత్యేక ప్రోత్సాహకం అందజేసేందుకు పిఓ ప్లాన్ చేశారు. టెన్త్ తర్వాత పై చదువులోకి వారికి అండగా నిలవడమే కాకుండా కార్పొరేట్ కాలేజీల్లో సీట్లు ఇప్పించి వారిని మరింత ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నారు. వీరికి ప్రత్యేక నగదు పురస్కారం, స్టడీ మెటీరియల్స్ కూడా అందించనున్నారు. వారు లక్ష్యాలను సాధించేంత వరకు ఐటీడీఏ అండగా నిలిచేలా పిఓ రాహుల్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటువంటి ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష భద్రాచలం ఐటిడిఏ చరిత్రలో ఇదే మొదటిది కావడం గమనార్హం. గిరి బిడ్డల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్ ని ప్రత్యేకంగా అభినందించాల్సిందే.

# అటవీ ప్రాంతాల్లో వెంటనే తునికాకు మోడెం నరికించాలి.

- పేదలకు ఉపాధి కల్పించాలి..
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డిమాండ్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 22,జిల్లాలో అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు మోడం విస్తృతంగా నరికించాలని 50 ఆకుల కట్టకు ఐదు రూపాయలు ధర నిర్ణయించాలని. గత బోనస్ బకాయిలు చెల్లించాలని. బీమా సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో శనివారం చర్ల రేంజర్ అధికారికి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు కె .రంగారెడ్డి, జిల్లా నాయకురాలు కె .కల్పన, దాసరి సాయి, మునిగేలా శివ ప్రశాంత్ సుజాత ,మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య , సరళ , లక్ష్మక్క, కృష్ణ, నాగరాజు, రాజశేఖర ,రామ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కె. రంగారెడ్డి మాట్లాడుతూ. తునికాకు సేకరణ ద్వారా సుమారు 13 లక్షల మంది కి ఉపాధి లభిస్తుందని ఇది ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయం తర్వాత ఆదివాసులకు ఇతర పేదలకు రెండో ఆదాయంగా ఉంటుందని ఆయన అన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి తునికాకు సజావుగా నడిపించాలని మోడెం నరికించే పనులు చేపట్టాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# దేగల యోగా నందిని ఆత్మహత్య బాధాకరం.

**మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్.**



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 22, ఏపీలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక గ్రామానికి చెందిన యోగానందిని ఫస్ట్ ఇయర్ విద్యార్థి నీ ఖమ్మంలో శ్రీ చైతన్య కాలేజీ లో ఆత్మహత్య చేసుకోవటం బాధాకరం. భద్రాచలం స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు మాల మహానాడు పట్టణ కమిటీ అధ్యక్షులు చెన్నగా అర్జున్ అధ్యక్షతన జరిగిన మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ మాట్లాడుతూ ఖమ్మంలో శ్రీ చైతన్య కాలేజ్ గతంలో కూడా ఎన్నో సంఘటనలు జరిగినప్పటికీ కేవలం డబ్బుతోనే పరిష్కరించు కుంటారని ఇలాంటి మరణాలు కేవలం దళిత పిల్లలకు దొరుకుతుందని దేగల యోగానందిని మరణానికి కారణమైన శ్రీ చైతన్య యజమానంపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఈ కాలేజీలు కేవలం అధికార అండదండల తోనే నడుస్తున్నాయని ఎవరు చనిపోయిన డబ్బుతోనే ముడిపెట్టి ప్రయత్నాలు చేస్తున్నారని ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఉన్న శ్రీ చైతన్య కాలేజీ లన్ని కూడా మూసివేయాలని డబ్బున్న వారికే అధికారులు అండదండలు కూడా ఉంటాయని ఈ సందర్భంగా దాసరి శేఖర్ తీవ్రంగా ఖండించారు ఈ కార్యక్రమంలో సినీగిరి చిట్టిబాబు కందుల పాపయ్య దేవరాజు కుమార్ శ్రీను రమేష్ హరి రామకృష్ణ రాము తదితరులు పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం.

**-డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్.**

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 22,

మణుగూరు ఏరియా సిని కాలనీ సింగరణి పాఠశాల నందు శనివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో" వరల్డ్ థింకింగ్ డే" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్ ఈ సందర్భంగా వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెస్- పావెల్ చిత్రపటానికి పూల మాలలు వేసిన అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్, పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యురాలు కల్యాణి , పాఠశాల ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థిని విద్యార్థులు కలిసి సంయుక్తంగా సర్వమత ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిధి డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ మాట్లాడుతూ... తరతరాల యువత స్నేహ భావంతో, సేవ దృక్పదంతో జాతి సేవకు అంకితమయ్యేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని స్థాపించిన రాబర్ట్ బాడెన్-పావెల్ దూర దృష్టితో ప్రపంచ మానవ జాతికి చేసిన గొప్ప సేవకు గాను రాబర్ట్ బాడెస్- పావెల్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22వ తేదీన వరల్డ్ థింకింగ్ డే నిర్వహించుకుంటున్నాము. వారి గొప్ప సేవా దృక్పద స్ఫూర్తితో నేటి తరం కూడా స్పోర్ట్స్ అండ్ గైడ్స్ ఎంతో శిక్షణతో, క్రమ శిక్షణతో, చురుకుదనంతో, సేవా భావాన్ని అలవర్చుకోవడం సమాజానికి ఇతోధికంగా చేయుతను అందించడం, ఆపత్ సమయంలో ధైర్య సాహసాలు చూపడం వంటి గుణాలతో జాతి సేవలో నిమగ్నమయి ప్రత్యక్షంగా సమాజానికి పరోక్షంగా దేశానికి అమూల్య సేవలు అందించాలి. అలాగే 2025 ప్రపంచ ఆలోచన దినోత్సవం యొక్క నినాదమైన "మన ప్రపంచం, అభివృద్ధి చెందుతున్న మన భవిష్యత్తు" అంశం సాధికారికతకు త్రికరణ శుద్ధిగా పాటుపడాలి. ఇందుకు గాను పిల్లలు స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరేందుకు గాను తల్లిదండ్రులు కూడా తమవంతు ప్రోత్సాహం అందించాలి అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య గీతాలు ఎంతగానే ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమలో చివరి అంశమైన శాంతి యాత్ర ర్యాలీని డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ జెండా ఊపి ప్రారంభించగా ఈ ర్యాలీలో అతిధులు, ఉపాద్యాయిని ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షకులు మరియు పెద్ద సంఖ్యలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థి విద్యార్థునులు పాల్గొనగా సింగరేణి పాఠశాల నుండి కాలనీ వరకు శాంతి యాత్ర ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు కల్యాణి, పాఠశాల ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ బి సరిత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# జగదీష్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో:-జడ రాములు యాదవ్



వేములపల్లి సికె న్యూస్ ఫిబ్రవరి 22:తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ప్రస్తుత ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సూర్యాపేట ఏకైక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని తెలంగాణ రాష్ట్ర టిడిపి నాయకుడు,వేములపల్లి మండల పిఎసిఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్ ఒక ప్రకటనలో త్రీవంగా స్పందించారు.శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతు సూర్యాపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి శుక్రవారం రోజున మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఉద్యమ సమయంలో తన్ని తరిమేశామని నీవు ఎంత అనే వ్యాఖ్యలతో సంబోధించడంతో అట్టి వ్యాఖ్యలపై స్పందించిన జడ రాములు యాదవ్ బీఆర్ఎస్ అధినేత అయినటువంటి ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు చంద్రశేఖర రావు ఏ పార్టీలో నుండి వచ్చాడని కుళ్ళు కుతంత్రాల నుండి వచ్చినటువంటి బిఆర్ఎస్ పార్టీ ప్రతిసారి ప్రాంతీయ విభేదాలు సృష్టించి అధికారాన్ని సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు.మరోసారి బీఆర్ఎస్ నాయకులు టిడిపి నాయకుల పై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగ టిడిపి శ్రేణులు బీఆర్ఎస్ నాయకులను రోడ్లమీద తిరుగనీయరని ఆయన హెచ్చరించారు

# ప్రతి మండలంలో రెండు పాఠశాలల్లో రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి....

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ
- గ్రంథాలయ సంస్థ కార్యకలాపాలపై సమీక్ష చేసిన అదనపు కలెక్టర్



సికె న్యూస్ ప్రతినిధిఖమ్మం, ఫిబ్రవరి -22:
ప్రతి మండలంలో రెండు పాఠశాలల్లో రీడింగ్ రూమ్ లు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తక పఠనం పై ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి, రీడింగ్ రూమ్ ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. గ్రంధాలయాల మరమ్మత్తులు, అభివృద్ధి పై దృష్టి పెట్టాలన్నారు. నిధుల లేమి కారణంగా నిలిచిన పనులను అందుబాటులో ఉన్న నిధులతో పూర్తి చేయాలన్నారు.
గ్రంథాలయం ద్వారా గత సంవత్సర నిధుల కేటాయింపు, ఖర్చు, రాబోయే సంవత్సరం నిధుల ప్రతిపాదనలు సమగ్రంగా అన్ని వివరాలతో రూపొందించి, సంస్థ సభ్యుల సమావేశం వచ్చే వారంలో ఏర్పాటుచేసి, సభ్యుల తీర్మానం పిదప ఆమోదానికి పంపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా గ్రంధాలయ సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి అర్జున్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ మంచికంటి నగర్ లో దేవుడి స్థల వివాదం.





సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఫిబ్రవరి 22,పాల్వంచ పట్టణ పరిధిలోని మంచికంటి నగర్లో దేవుడి కేటాయించిన స్థలంలో బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఆంజనేయ స్వామి గుడికట్టుట కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించడంతో,వివాదం మొదలైందని వారు ఆరోపించారు. వివరాల్లోకి వెలితే మంచికంటి కంటినగర్ లో గత 20 సంవత్సరాల క్రితం ఎం ఆర్ ఓ మస్తాన్ రావు వున్న సమయంలో మంచికంటి నగర్లో కొంత స్థలాన్ని హిందువుల సౌకర్యర్థం దేవుడి గుడి కట్టుకొన కొంత స్థలాన్ని కేటాయించారు.ఆ స్థలంలోనే కొంత స్థలాన్ని మంచికంటి నగర్ ప్రజలకు మంచినీటి సాకర్యం కోసం నవబారత్ వారు ఒక షెడ్ నిర్మాణం చేశారు.మిగిలిన స్థలంలో ఇటీవలే కాలంలో ఆంజనేయ స్వామి దవాలయం నిర్మించుటకు భూమి పూజ కార్యక్రమం చేయడంతో సీపీఎం పార్టీ నాయకులు అడ్డుకొనడంతో వివాదం మొదలైందని అన్నారు. ఇట్టి విషయంలో గ్రామకమిటీ పెద్దలు స్థానిక పోలీస్ స్టేషన్ మరియు ఎమ్మార్వో, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆలోచించారు. ఎ పార్టీలతో సంబంధం లేకుండా హిందువుల మనోభావాలకు బంగం కలిగిస్తున్న సిపిఎం పార్టీ నాయకులకు ఈ సందర్భంగా తెలియజేస్తున్న విషయం ఏమిటంటే దేవుడికి కేటాయించిన స్థలంలో దేవుడి నిలుపుకోవటం విషయంలో సిపిఎం నాయకులు అడ్డుకోవడం హిందూ ధర్మాన్ని కించపరచడమేనని వారన్నారు. హిందువులు దేవుడికి కేటాయించిన స్థలంలో భూమి పూజ కార్యక్రమం చేసి ముహూర్తం వేసి జెండాలు పాతిన మరుసటి రోజే సిపిఎం పార్టీకి చెందిన కొందరు నాయకులు,మహిళా కార్యకర్తలు, జెండాలు.ముహూర్తమును తొలగించి హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా ప్రవర్తించడం హిందూ ధర్మాన్ని అబాసు పాలు చేయడమేనని వారు ఆరోపించారు.మేము సిపిఎం పార్టీకి వ్యతిరేకులం కామని మంచి కంటనగర్ లో ఏ సమస్య ఉన్నప్పటికీ సామరస్యంగా పార్టీలతో సంబంధం లేకుండా సమస్యలు పరిష్కరించు కుంటామని తెలిపారు.అధికాతులు సత్వరమే పరిష్కరించి ఎలాంటి గొడవలు కొట్లాటలకు తావివ్వకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొని హిందూ ధర్మాన్ని కాపాడి న్యాయం చేయాలని మీడియా ప్రముఖంగా కోరుతున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బొడ్రాయి గ్రామ కమిటీ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# పట్టు వదలకుండా చివరి వరకు పోరాడితే విజయం సాదించవచ్చు....



## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
## టెన్నిస్ క్రీడ మనిషిలోని నైపుణ్యతను, క్రీడాస్ఫూర్తిని చాటుతుంది
## ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ను టాస్ వేసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఫిబ్రవరి -22:ఓటమి అంచు వరకు వెళ్లి కూడా పట్టుదలతో ప్రయత్నిస్తే చివరికి విజయం సాధించవచ్చనే స్ఫూర్తి మనకు టెన్నిస్ క్రీడా ఇస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ (కే.డి.టి.ఏ.) అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ను శనివారం జిల్లా కలెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు.సర్దార్ పటేల్ స్టేడియం చుట్టూ తిరిగి కలెక్టర్ సౌకర్యాలను, టెన్నిస్ కోర్టులను పరిశీలించారు. టోర్నమెంట్ నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కలెక్టర్ ట్రయల్ మ్యాచ్ ఆడి తనకు క్రీడల పట్ల ఉన్న మక్కువను ప్రదర్శించి ఉత్తేజపరిచారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీలకు ఖమ్మం వేదికైందని అన్నారు. మంచి కోర్టు, అహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవడం మన జిల్లాలో ఉన్న టెన్నిస్ అసోసియేషన్ చిత్తశుద్ధికి నిదర్శనమని కలెక్టర్ ప్రశంసించారు. రాబోవు రోజుల్లో మరింతగా మన క్రీడా స్ఫూర్తి చాటుకునే లాగా టెన్నిస్ క్రీడను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. టెన్నీస్ తనకు చాలా ఇష్టమైన క్రీడ అని అన్నారు. ఖమ్మంలో టెన్నిస్ కోర్టు నిర్వహణ చాలా బాగుందని, ఇక్కడ పిల్లలకు టెన్నిస్ లో మంచి శిక్షణ అందిస్తున్న కోచ్ లు ఉండటం మనందరి అదృష్టమని అన్నారు. టెన్నిస్ క్రీడ ద్వారా మంచి ఫిజికల్ ఫిట్ నెస్, మెంటల్ స్టేబిలిటీ లభిస్తాయని అన్నారు. టెన్నిస్ క్రీడలో ఎటువంటి పరిస్థితుల్లో నుంచైనా విజయం సాధించవచ్చని, 5 సెట్లలో రెండు సెట్లు కోల్పోయి మూడవ సెట్ లో చివరి పాయింట్ దగ్గర నుంచి పోరాడీ విజయం సాధించిన మ్యాచ్ లు అనేకం ఉన్నాయని, ఫెదరర్, నాథల్, జకోవిచ్ లాంటి క్రీడాకారులు అనేక సార్లు ఓడిపోయే పరిస్థితుల నుంచి విజయం సాధించారని కలెక్టర్ తెలిపారు.
మన జీవితంలో కూడా ఎటువంటి పరిస్థితులు వచ్చిన నిబద్ధతతో, నిజాయితీగా ఉంటూ ఓటమి ఒప్పుకోకుండా చివరి వరకు పట్టు వదలకుండా మన పని చేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తామని, ఆ స్ఫూర్తి మనకు టెన్నిస్ క్రీడ అందిస్తుందని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు.
టెన్నిస్ క్రీడ ఆడుతున్న సమయంలోనే పోటీ ఉంటుందని, గేమ్ ముగిసిన తర్వాత గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి ప్రతి ఒక్కరు పాటించాలని కలెక్టర్ సూచించారు. డబుల్స్ గేమ్ ద్వారా ఇద్దరు క్రీడాకారుల మధ్య సమన్వయం ఎలా ఉండాలో మనకు తెలుస్తుందని అన్నారు.
భారతదేశం నుంచి మరో లియాండర్ పేస్, సానియా మీర్జా లాంటి టెన్నిస్ క్రీడాకారులు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఆర్థికంగా సూపర్ పవర్ అవడంతో పాటు క్రీడలలో కూడా భారతదేశం మరింత రాణించాలని అన్నారు. జీవితంలో విద్యార్థులు క్రీడలు, చదువు, కుటుంబం, ఫ్రెండ్స్ అందరినీ బ్యాలెన్స్ చేస్తూ ఉండాలని కలెక్టర్ సూచించారు.
మొదటి జాతీయ మ్యాచ్ ను కర్ణాటకకు చెందిన ఆర్యన్ మెహతా, మహారాష్ట్రకు చెందిన ఆదిత్య రానావడే అనే ఇద్దరు క్రీడాకారుల మధ్య తొలి మ్యాచ్ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ టాస్ వేసి ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, ఏసీపీ కుమారస్వామి, ట్రాఫిక్ సిఐ సాంబశివరావు, టెన్నిస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డా. అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, చీఫ్ రిఫరీ ప్రవీణ్ నాయక్, కాళ్ల పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, కాళ్ల సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటకు రైల్వేలైన్ అత్యవసరం చిలకలూరిపేట రైల్వేలైన్ ఏర్పాటుపై శాసనమండలి లో ప్రస్తావిస్తా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ గారు...



చిలకలూరిపేట :ఫిబ్రవరి 22 సి కే న్యూస్ :చిలకలూరిపేటలో రైల్వేలైన్ అత్యవసరమని, ఈ దిశగా రానున్న శాసనమండలి సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ గారు రైల్వే లైన్ సాధన సమితి కమిటీకి హామీ ఇచ్చారు. ఈరోజు రైల్వే లైన్ సాధన సమితి ఆధ్వర్యంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు శ్రీ మర్రి రాజశేఖర్ గారిని మరి నివాసంలో కలసి చిలకలూరిపేట రైల్వే లైన్ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా మర్రి రాజశేఖర్ గారు స్పందిస్తూ ఈ ప్రాంతానికి రైల్వేలైను ఏర్పాటు చేయాలని గతం నుంచి ఎన్నో ప్రయత్నాలు కొనసాగాయని, దశాబ్దాల కిందటే నాటి చిలకలూరిపేట శాసనసభ్యులు స్వర్గీయ సోమేపల్లి సాంబయ్య గారు ఆనాటి గుంటూరు పార్లమెంటు సభ్యులు ఆచార్య ఎన్జీ రంగా గారి దృష్టికి రైల్వే లైన్ ఆవశ్యకతను గురించి తీసుకువెళ్లారని గుర్తు చేశారు.రైల్వేలైన్ వల్ల చిలకలూరిపేటతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.చిలకలూరిపేటలోని స్పిన్నింగ్ మిల్లులు, పొగాకు పరిశ్రమ, బాపట్ల జిల్లా పర్చూరు, మార్టూరు గ్రానైట్ పరిశ్రమల నుంచి ఎగుమతులు, దిగుమతులు ఆయ్యే ఆవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.స్థానికంగా ఉన్న స్పిన్నింగ్, ఆయిల్ మిల్లులు తమ సరుకులను దూరప్రాంతాలకు రవాణా చేయడానికి ఏటా సుమారు రూ. 100 కోట్లు పైబడి వెచ్చిస్తున్నారని, స్థానికంగా ఉన్న పలు పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు ఇతరా రాష్ట్రాలకు చెందిన వారే. వారి ప్రయాణ సౌకర్యానికి రైల్వేలైను ఎంతో ఆవసరమని తెలిపారు.దీంతో పాటు పర్యాటక రంగం ఆభివృద్ధి చెందుతున్న దృష్ట్యా కొండవీడు వంటి చారిత్రక ప్రదేశాలకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు చేరుకోవడానికి ప్రయాణం సౌకర్యంగా ఉంటుందని వెల్లడించారు.
ఈ సందర్బంగా రైల్వేలైన్ సాధన సమితి కన్వీనర్ షేక్ సుబాని మాట్లాడుతూ చిలకలూరిపేటకు రైల్వేలైన్ ఏర్పాటు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు, పారిశ్రామికవేత్తలు సైతం సంఘీభావం ప్రకటించారని వెల్లడించారు. ఈ అంశంపై ముందడుగు పడాలంటే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైల్వేలైన్ సాధన కోసం కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై ప్రజలు కలిసి రావాలని, స్వచ్ఛంధంగా మద్దతు తెలిపి రైల్వేలైన్ సాధన కోసం జరిగే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.
కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు గారు , మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల గారు , ఎమ్మార్పీఎస్ నాయకులు అడపా మోహన్‌మాదిగ గారు , ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు షేక్ బాజి గారు , జనక్రాంతి పార్టీ నాయకులు గౌస్ గారులి తదితరులు పాల్గొన్నారు.

# కారంపూడి మండలంలో ఇద్దరు వీఆర్వోల వింత ప్రవర్తన

పల్నాడు, ఫిబ్రవరి22 సి కే న్యూస్ : అగ్రిమెంట్లతో ఆన్లైన్ పాస్ బుక్ తెప్పిస్తున్న వీఆర్వోలు.. సదరు విఆర్వోలకు సపోర్ట్ చేస్తున్న మండల స్థాయి రెవిన్యూ అధికారి.? లక్షల్లో చేతులు మారిన వైనం. ఇంత జరుగుతున్న పై అధికారులు పట్టించుకోవట్లేదు అంటూ బాధితుల ఆవేదన. విఆర్వోని వేడుకున్న కానీ వాళ్ళ దగ్గర ఏవో కాగితాలు తెచ్చుకున్నారు. మీరు కూడా ఏదో ఒకటితెచ్చుకోండి.. అంటూ వెటకారపు సమాధానంతో వికిలి నవ్వులతో అమాయక రైతులను అవమానిస్తున్న సదరు విఆర్ఓ.. అమాయక బాధితులు స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ తిరిగిన మాకు సాయంత్రం దాకా కుదరదు.. లేకపోతే రేపు రా.. రేపు రా.. అంటూ మాట దాటవేస్తూ మొఖం తప్పిస్తున్నారు. లబోదిబోమంటున్న బాధితులు.. గతంలో ఇదే మండలంలో ఒక ఊరిలో విఆర్ఓ చేస్తూ ఒకసారి భారీ అవినీతితో సస్పెండ్ అయ్యి మళ్లీ అదే ఊరిలో పోస్టింగ్ తెచ్చుకొని ప్రస్తుతం అదే మండలంలో వేరే ఊరిలో విఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న సదరు ఉద్యోగి ఎన్నిసార్లు సస్పెండ్ అయిన బుద్ధి మార్చుకొని వైనం అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 4 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్లు రద్దు

: రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని.. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోదియా తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో.. 4 లక్షల ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించినట్లు ఆర్పీ సిసోడియా స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా వెంట జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అక్రమంగా చేసిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తామని వెల్లడించారు.ఏపీలో దాదాపు 13 లక్షల ఎకరాలకు గానూ 4 లక్షల ఎకరాల భూములను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు రెవెన్యూశాఖ గుర్తించినట్లు చెప్పారు. ఈ లక్షల ఎకరాల భూముల్లో 25 వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేసినట్లు వెల్లడించారు. ఆ భూముల్లో 8 వేల ఎకరాల వరకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేలినట్లు స్పష్టం చేశారు. ఇక నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన 4 లక్షల ఎకరాల భూములతోపాటు ఈ 8 వేల ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకున్నట్లు ఆర్పీ సిసోడియా తేల్చి చెప్పారు.గతేడాది అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల కాలిపోవడంతో మొత్తం ఆఫీస్ దెబ్బతింది. ఈ క్రమంలోనే మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌ను పునరుద్ధరించగా.. ఆ కార్యాలయాన్ని ఆర్పీ సిసోడియా బుధవారం ప్రారంభించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ విషయాలు వెల్లడించారు. ఇక ఆఫీస్ దహనం అయిన 2400 దస్త్రాలను తిరిగి రికవరీ చేసినట్లు వెల్లడించారు. కలెక్టర్, తహసీల్దార్ల కార్యాలయాల్లో ఉన్న రికార్డుల లింకు దొరకడంతో ఈ దస్త్రాలను రికవరీ చేయడం సాధ్యమైనట్లు తెలిపారు.ఈ క్రమంలోనే ఆ దస్త్రాల రికవరీలో భాగంగానే ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలు బయటికి వచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు.. ఈ మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్ దస్త్రాల దహనం కేసులో ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే కొందరిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నామని.. వేరే బయటి వ్యక్తులతో సంబంధాలు ఉండడంతో దర్యాప్తు పూర్తి అయ్యేందుకు కొంత సమయం పడుతోందని వివరించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం వాస్తవమేనని అంగీకరించిన ఆర్పీ సిసోడియా.. ఉద్యోగ ప్రమోషన్ల విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలతో ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. కొత్త రిక్రూట్‌మెంట్లు కూడా త్వరలోనే చేపడతామని స్పష్టం చేశారు.

## లగడపాటి దారిలో కేశినేని నాని, కాకపోతే చిన్న ట్విస్ట్

బెజవాడలో రాజకీయ నేతలు ఓడిపోతే రాజకీయాలకు దూరమైనట్టేనా? కాంగ్రెస్ మాజీ ఎంపీ లగడపాటి దారిలోనే కేశినేని నాని నడుస్తున్నారా? కేశినేని నాని కామెంట్స్ వెనుక అసలేం జరుగుతోంది? నాని చూపంతా కమలంపై పడిందా? పదవి లేకపోయినా.. ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎందుకన్నారు? ఇదే చర్చ ఏపీ రాజకీయాల్లో సాగుతోంది.విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. విజయవాడ పార్లమెంట్ సెగ్మెంట్‌లో తిరువూరు, నందిగామ, మైలవరం ప్రాంతాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నట్లు ఓ టాక్ నడుస్తోంది. తాను బరిలోకి దిగుతానని సన్నిహితుల వద్ద ఆయన చెప్పినట్టు ఓ ఫీలర్ బెడవాడ పొలిటికల్ సర్కిల్స్ లో హంగామా చేస్తోంది. ఆయన ఏ పార్టీ వైపు వెళ్తారు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చారు కేశినేని నాని. కొద్దిరోజుల తర్వాత ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. కొత్త పార్టీ కంటే పాత పార్టీలే బెటరని భావించారు. ఆ తర్వాత టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చారు. 2014, 19 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తన జిల్లాకు చెయాల్సిన పనులు చేపట్టారు. కాకపోతే రెండుసార్లు ఎంపీగా గెలవడంతో తనకు తిరుగులేదని భావించారు. ఆ తర్వాత పార్టీకి వ్యతిరేకంగా గళం వినిపించారు. గత ఎన్నికల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఆయన, తన తమ్ముడు శివనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆనాటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.లేటెస్ట్‌గా నందిగామలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకున్నానని, కాకపోతే ప్రజా సేవ మాత్రం వీడలేదన్నది ఆయన మాట. పదవిలో లేకపోయినా ప్రజలకు నిత్యం అందుబాటులోనే ఉంటానని తన మనసులోని మాట బయపెట్టారు. గడిచిన పదేళ్లు ఎవరి దగ్గర కప్పు టీ కూడా తాగకుండా పని చేశానని తన గురించి కాసింత మంచి మాటలు చెప్పుకొచ్చారు.ప్రస్తుతం కేశినేని నాని చూపు బీజేపీపై పడింది. ఎంపీగా ఉన్న పదేళ్ల కాలంలో బీజేపీ నేతలతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాలను ఉపయోగించుకుని కాషాయం పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు నాని అనుచరుల మాట. మరోవైపు ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో ఆయన ఇప్పటికే మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై పార్టీ హైకమాండ్ తో ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.కూతురు శ్వేతకు రాజకీయ భవిష్యత్తు ఇవ్వడం కోసం ఆయన బీజేపీని ఎంచుకున్నట్లు వార్తలు లేకపోలేదు. కేశినేని నాని చేరికను టీడీపీ అంగీకరిస్తుందా? అనేది ఇక్కడ ఆసక్తికరమైన విషయం. ఒకవేళ కేశినేని నాని బీజేపీ తీర్థం పుచ్చుకుంటే విజయవాడ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలున్నాయి.ఒక్కసారి విజయవాడ ఎంపీ నియోజకవర్గం విషయానికొస్తే.. విజయవాడలో కంటిన్యూగా రెండుసార్లు ఎంపీగా గెలిచినవారు ఆ తర్వాత రాజకీయాలకు దూరమైన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉపేంద్ర రెండుసార్లు (1996, 1998) కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కూడా అంతే. 2004, 2009 ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఆయన గుడ్ బై చెప్పేశారు. ఇప్పుడు మాజీ ఎంపీ కేశినేని నాని వంతైంది. ఆయన కూడా 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ క్రమంలో కేశినేని కూడా రాజకీయాలకు దూరమయ్యారు.

## తినోళ్లకు తిన్నంత చికెన్

తెలుగు రాష్ట్రాలను బర్డ్ ఫ్లూ భయాలు వెంటాడుతున్నాయి. చికెన్ తింటే బర్డ్ ఫ్లూ వస్తుందనే భయంతో చాలా మంది చికెన్, కోడి గుడ్లకు దూరంగా ఉంటున్నారు. మాంసం, కోడి గుడ్లు బాగా ఉడికిస్తే ప్రమాదం ఉండదని అధికారులు చెప్తున్నప్పటికీ.. జనాల్లో ఆందోళన తగ్గడం లేదు. దీంతో చికెన్ రేట్లు పడిపోయాయి. కోడి గుడ్డు ధర సైతం భారీగా పతనమైంది. చికెన్, కోడిగుడ్ల రేట్లు పడిపోవటంతో కోళ్లఫారం యజమానులు, పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఫౌల్ట్రీ ఫెడరేషన్ నివారణ చర్యలకు దిగింది. ఫౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగానే గుంటూరులో చికెన్ ఫుడ్ మేళా నిర్వహించారు.ఫౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన చికెన్ ఫుడ్ మేళాకు విశేషమైన స్పందన వచ్చింది. చికెన్ ఫుడ్ మేళాలో నిర్వాహకులు చికెన్ వంటకాలను ఉచితంగా అందజేశారు. ఉడికించిన చికెన్, కోడి గుడ్లు తినడం వల్ల ఇబ్బంది ఉండదని వచ్చిన జనాలకు నిర్వాకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహ్మద్ సైతం పాల్గొన్నారు. మరోవైపు ఉచితంగా చికెన్ వంటకాలు పంపిణీ చేస్తూ ఉండటంతో ఆహార ప్రియులు చికెన్ ఫుడ్ మేళాకు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నిర్వాహకులు గేట్లకు తాళం వేయాల్సి వచ్చింది. అటు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కూడా ఇలాగే ఫ్రీగా చికెన్ పంపిణీ చేశారు. ఉచితంగా చికెన్, కోడిగుడ్ల వంటకాలు పంపిణీ చేశారు.

# తిరుపతి మేయర్ పై అవిశ్వాసం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మార్పులు జరుగుతున్నాయి. తిరుపతిలో సైతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి. త్వరలో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో 3 లక్షలపైగా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 50 డివిజన్లు ఉన్నాయి. 2020లో కొవిడ్ ప్రారంభ సమయంలో కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ధన, ఆర్థిక, అంగ బలంతో 50 డివిజన్లలో 25శాతం మాత్రమే ఎన్నికలు జరిగేలా చేసింది. అప్పట్లో కనీసం నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వారి డాక్యుమెంట్లు సైతం లాకెళ్లిన ఘటనలు చూశాం. ఆ సన్నివేశాలను పోలీసులు చూస్తు ఉన్నారు తప్ప ఏమి చేయలేని పరిస్థితి. నామినేషన్లు దాఖలు చేసిన వారివి సైతం పత్రాలు చింపేసి అధికారులను అడ్డం పెట్టుకుని మరీ ఏకగ్రీవాలు చేశారు. ఆ సమయంలో కొవిడ్ కారణంగా లాక్ డౌన్ రావడంతో ఆ ఎన్నికలు వాయిదా పడ్డాయి. కొవిడ్ పరిస్థితుల తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లు 50గాను 48 సొంత చేసుకున్నారు. 1 మాత్రమే టీడీపీ కైవసం చేసుకోగ.. 1 డివిజన్ కార్పొరేటర్ కోర్టును ఆశ్రయించగా ఎన్నికలు లేకుండా పోయింది.50 మంది కార్పొరేటర్లు మేయర్‌గా బీసీ (యాదవ) వర్గానికి చెందిన డాక్టర్ శిరీష ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన ముద్ర నారాయణను నిలబెట్టారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండో డిప్యూటీ మేయర్ కోసం జీవో విడుదల చేయగా రెండో డిప్యూటీ మేయర్‌గా అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు భూమన అభినయ్ రెడ్డిని ఎన్నుకున్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో వైసీపీ తరపున కార్పొరేటర్లు నోరు సైతం మెదపకుండా వారికి కావాల్సింది చేసుకుంటూ కౌన్సిల్ సమావేశం మీడియా సైతం అనుమతి లేకుండా పాలన సాగించారు. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 60వేల పైగా మెజారిటీతో గెలుపొందారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 4 కార్పొరేటర్లు ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఎన్నికల తరువాత కొంత మంది కార్పొరేటర్లు సైతం వైసీపీ వీడి కూటమి వైపు మొగ్గు చూపినా తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. అప్పటి వరకు బాగానే ఉన్నా మేయర్ తన పదవితో ఎమ్మెల్యే సహా ఎవర్నీ మాట్లాడనీయకుండా చేశారు. కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే కార్పొరేటర్లను టార్గెట్ చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఎన్నికల్లో ఓటమి కారణంగా రెండో డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి రాజీనామా చేశారు. డిప్యూటీ మేయర్ పోస్టు ఖాళీ కావడంతో ఇటీవల డిప్యూటీ మేయర్ పోస్టుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు జరిగాయి. ఈ డ్రామా మధ్యే 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ ముని కృష్ణ డిప్యూటీ మేయర్ ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక తరువాత తొలి తిరుపతి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ ముని కృష్ణ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తరువాత బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం అజెండా అంశాలు చర్చకు వచ్చాయి. తన ముందే డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా అధికారులు దౌర్జన్యానికి దిగారని వారిపై చర్యలు తీసుకోవాలని మేయర్ డాక్టర్ శిరీష డిమాండ్ చేశారు. దీనిపై రియాక్ట్ అయిన కమిషనర్ మౌర్య క్షమాపణ చెప్పి ఏమి జరిగిందో విచారణ చేస్తామని చెప్పారు. అయితే దానికి సంతృప్తి చెందని మేయర్ కౌన్సిల్ నుంచి బాయ్ కాట్ చేశారు. దీంతో ఏమి చేయాలో తెలియక... కోరం నిర్ణయం మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు డిప్యూటీ మేయర్ గా ఉన్న ముద్ర నారాయణను మేయర్ గా పెట్టి కౌన్సిల్ పూర్తి చేశారు.తిరుపతి మేయర్ ఉన్న అక్రమంగా భవనాలకు ఎలా అనుమతి ఇచ్చారు. ఇంత కాలం ఏమి చేశారు. అధికారుల పై చర్యలు గతంలో ఎందుకు తీసుకోలేదని కార్పొరేటర్లు చర్చకు దిగారు. మేయర్ హోదాలో సభ నుంచి బాయ్ కాట్ చేయడం ఏంటని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలంటే అవిశ్వాసం పెట్టి ఆమెను పదవి నుంచి తొలగించాలని పావులు కదుపుతున్నారు. బీసీ (యాదవ్) సామాజికవర్గానికి చెందిన అన్నా అనిత, అన్నిత సంధ్య మేయర్ పదవి కోసం ఎదురుచూస్తుండగా ఇదే అదునుగా భావించి మరింత వేగంగా కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నారు. మార్చి నెలలో జరిగే కౌన్సిల్ సమావేశంలో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మిగిలిన 8 నెలల కాలంలో మేయర్ పదవి సొంతం చేసుకోవడం వల్ల ఏమి లాభం ఉంటుందనేది కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఏమి జరుగుతుందో మార్చి వరకు వేచి చూడాల్సిందే.

# రూ.3 లక్షల కోట్లతో.. బడ్జెట్

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 24న ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఏపీ అభివృద్ధిలో ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని నేతలు చెబుతున్నారురాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 28న చట్ట సభలకు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడంతో.. ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఉభయ సభల సమావేశం ప్రారంభం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఈనెల 25న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉండనుంది.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో చెప్పిన పథకాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం వనరుల సమీకరణపై ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో రెండు మూడుసార్లు సమావేశమయ్యారు.చంద్రబాబుతో సమావేశం తర్వాత.. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. అన్ని శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యంగా జలవనరుల శాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, విద్య, వైద్య శాఖలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇటు కేంద్ర ప్రాయోజిత పథకాలను ఎక్కువగా వినియోగించుకునేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అటు కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టేలా ప్లాన్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ.. నిధులు సమీకరించుకోవాలి ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య శాఖ ద్వారా కేంద్రం నుంచి ఎక్కువ నిధులు పొందవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను.. కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక విధానాన్ని అమలు చేసింది. దీంతో ఆదాయం తగ్గింది. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం చేస్తోంది. ఇది కొంతమేర



ఊరటనిస్తోంది. అయితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక సాయం చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతున్నారు.గత ప్రభుత్వం భవిష్యత్తు ఆదాయాలను కూడా తాకట్టు పెట్టిందని.. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.

సరే.. ఇవన్నీ పక్కనపెడితే బడ్జెట్ పై ఇప్పటికే అధికారులు కసరత్తులు చేశారు. ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అధికారులతో సమావేశమై ఏ ఏ శాఖలకు నిధులు కేటాయింపులు జరపాలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 - 25 సంవత్సరానికి 2.95 లక్షల కోట్లతో బడ్జెట్ అంచనాలను రూపొందించి గత శాసనసభలో ప్రవేశపెట్టింది. ఇందులో రెవెన్యూ వ్యయంగా 2,35,916 కోట్లు, మూలధన వ్యయంగా 32,712 కోట్ల రూపాయలుగా చూపించింది. ప్రభుత్వం మారింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం మూడు లక్షల కోట్లకు పైగానే బడ్జెట్ ను శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశముంది... అయితే గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు నిధుల కేటాయింపుపైనే ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వరసగా మూడు నెలలకు మూడు హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. మార్చి నెలలో మహిళలకు బస్సు ప్రయాణం, ఏప్రిల్ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, మే నెలలో తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేయాలని ఇప్పటికే చంద్రబాబు నిర్ణయించారు. ఈ మూడు పథకాలకు సంబంధించి దాదాపు పదిహేను నుంచి ఇరవై వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

అయితే ఈ పథకాలకు సంబంధించి ఇంత వరకూ విధివిధానాలను ఖరారు చేయకపోవడంతో పాటు నిధులు ఎంత కేటాయిస్తారన్న దానిపై కూడా చర్చ జరుగుతుంది. మరొక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్ట్స్ అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించాలి. కేవలం పోలవరానికి మాత్రమే కాకుండా బనకచర్లకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. బనకచర్ల ను చంద్రబాబు గేమ్ ఛేంజర్ గా అభివర్ణిస్తుండటంతో దానికి నిధులు కేటాయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. మరొక వైపు సంక్షేమ పథకాలకు కూడా పెద్దయెత్తున నిధులు కేటాయించాల్సి ఉంటుంది. బడ్జెట్ లో కేటాయింపులను బట్టే అవి అమలవుతాయా? లేదా? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశముంది. అందుకే మార్చి 3వ తేదీన ప్రవేశ పెట్టే బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి కూటమి ప్రభుత్వం ఏంచేస్తుందన్నది చూడాలి.

# ఒక్క రోజే ప్లీనరీ

జాతీయ పార్టీ అయినా ప్రాంతీయ పార్టీ అయినా ప్లీనరీ అంటే ఆ పార్టీ కార్యకర్తలకు అభిమాన శ్రేణులకి పండగనే చెప్పాలి. సాధారణంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లీనరీలు ఏర్పాటు చేస్తుంటారు పార్టీల అధినేతలు. పార్టీ శ్రేణులకు భవిష్యత్తు దిశా నిర్దేశం చేయడానికి ప్లీనరీలను ఏర్పాటు చేస్తాయి రాజకీయ పార్టీలు. పవన్ కల్యాణ్ లాంటి విపరీతమైన జనాకర్షణ ఉన్న నాయకుడు తన పార్టీకి ప్లీనరీ ఏర్పాటు చేస్తే ఆయన అభిమానులకు కార్యకర్తలకు ఎంతటి ఉత్సాహం ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఇప్పుడు జనసేన నేతలు, ఆయన అభిమానులు దాని కోసమే ఎదురు చూస్తున్నారు. పార్టీ స్థాపించిన పదేళ్లకు అధికారంలోకి వచ్చాం ప్లీనరీ ధూంధాంగా చేస్తారని రెండు రాష్ట్రాల్లోని జనసైనికులు ఎంతగానో ఎదురు చూస్తూ ఉన్నారు. ఇదిగో అదిగో అంటూ చాలా కాలం నుంచి వారిని ఊరిస్తూ వచ్చిన పార్టీ చివరకు విషయాన్ని చాలా కూల్‌గా చెప్పేసింది. ఈసారి పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గంలో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయబోతున్నారని పేర్కొంది. అయితే అందులో కూడా భారీ ట్విస్ట్ ఇచ్చింది జనసేన అధినాయకత్వం. కొద్ది కాలంగా ప్రచారంలో ఉన్నట్టు మూడు రోజులు కాకుండా కేవలం ఒక్కరోజుకే ప్లీనరీని పరిమితం చేసింది. నిన్న మొన్నటి వరకు పిఠాపురంలో ఈ ప్లీనరీ మూడు రోజులు పాటు జరుగుతుంది జోరుగా ప్రచారం జరిగింది. దీనిపై జనసేన హైకమాండ్ నీళ్లు చల్లి ఒక్క రోజుకే పరిమితం కావడంతో జన సైనికుల్లో నిరాశ కనిపిస్తోంది.అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరుగుతున్న పార్టీ ప్లీనరీ అందులోనూ అధినాయకుడు పవన్ కల్యాణ్ రికార్డు మెజారిటీతో గెలిచిన పిఠాపురంలో తొలి ప్లీనరీ. జన సైనికులు ఆనందంతో ఉప్పొంగిపోవడానికి ఈ ప్రకటన చాలు. మొదట్లో దానికి అనుగుణంగానే మూడు రోజులపాటు అంటే మార్చి 12 నుంచి 14 వరకు ప్లీనరీ జరుగుతుందని భావించారు. అందుకు తగ్గట్టుగానే పార్టీ ప్రతినిధులతో సమావేశం, శ్రేణులకు దిశా నిర్దేశం జరిగిపోయింది. జన సైనికులను ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభ అందులో పవన్ ప్రసంగం ఇలా పక్కా ప్లాన్‌తో మూడు రోజుల పాటు ప్లీనరీ సంబరం జరుగుతుందని అంతా భావించారు. ఈవిషయాన్ని జనసేన ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్ సహా ఇతర కీలక నేతలు జనవరిలోనే ప్రకటించారు. కాని సడన్‌గా ప్లీనరీ ఒక్కరోజే జరుగుతుందని జనసేన నుంచి ప్రకటన వెలువడింది. పార్టీ ఆవిర్భవించిన మార్చి 14 బహిరంగ సభ ఉంటుందని ప్రస్తుతానికి స్పష్టత వచ్చింది. పార్టీ ప్రతినిధుల సమావేశం అదే రోజు ఉదయం పూట జరుగుతుందా లేక అది రద్దు అవుతుందా అని దానిపై ప్రస్తుతానికి స్పష్టత రాలేదు.ఇటీవల పవన్ కల్యాణ్ అస్వస్థతకు లోనైనట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన క్యాబినెట్ మీటింగ్‌కి ఆయన అటెండ్ కాలేదు. అలాగే "జనంలోకి జనసేన" కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన లేదు. ప్రస్తుతానికి ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో బిజీగా ఉంటున్నారు. ఎక్కువగా స్ట్రెస్ తీసుకోవడం లేదని సమాచారం. ఒకవేళ ఇదే కారణమా లేక మరేదైనా ఆలోచనో తెలియదు. కానీ మూడు రోజులు జరుగుతుందని చెప్పిన ప్లీనరీ ఒక్క రోజుకే పరిమితం కావడం మాత్రం తమ అధినాయకుడు మూడు రోజులు పాటు తమతోనే ఉంటాడు అని భావించిన జన సైనికులకు కాస్త నిరాశ కలిగించే అంశమే.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# ట్రంప్‌పై నాటో దేశాలు తిరుగుబాటు.

అమెరికాలో ట్రంప్ రాకతో? ప్రపంచ రాజకీయాలు ఎప్పుడూ లేనంత ఆసక్తికరంగా మారాయి.ప్రపంచ పెద్దన్నగా అమెరికాలో ట్రంప్ రాక.. అంతర్జాతీయంగా అనూహ్యమైన మార్పులకు కారణం అయ్యింది. ప్రెసిడెంట్ ట్రంప్ టారీఫ్‌ల థ్రెట్ నుండీ.. నాటో సైనిక ఖర్చుల వరకూ యూరప్‌ను ముప్పు తిప్పలు పెట్టడానికి రెడీ అయ్యారు. అసలు ఎన్నికలు గెలవడానికి ముందు నుండే యూరప్‌ను బెదిరించడం మొదలు పెట్టారు ట్రంప్. నాటోకి కేటాయింపులు పెంచని యురోపియన్ దేశాలపై రష్యాను ఉసిగొల్పుతానంటూ వార్నింగ్ ఇచ్చారు. అక్కడ మొదలైన ఈ రెవల్రీ ఇప్పుడు మరింత రాజుకుంది.ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధంలో.. మధ్యవర్తిత్వానికి రెడీ అయిన ట్రంప్.. ఒంటి పోకడతో.. యూరప్ పెత్తనం అవసరంలేదని చెప్పారు. అంతేనా.. అవసరమైతే అభిప్రాయాలు తెలియజేయండి కానీ.. తగుదునమ్మా అని నిర్ణయాలు తీసుకోవద్దూ అంటూ రుబాబు చేశారు ట్రంప్. యూరప్‌తో సంబంధం లేకుండా సౌదీలో రష్యా అధికారులతో మంతనాలు మొదలుపెట్టారు. దీనితో? యురోపియన్ దేశాలు ఈగోపై బాంబ్ వేసినట్లయ్యింది. యూరప్ నాయకుల్లో ఆందోళన పెరిగింది.ఉక్రెయిన్ ఫ్యూచర్ గురించి రష్యాతో చేస్తున్న చర్చలకు అమెరికా తమను ఆహ్వానించకపోవడంతో యూరప్ దేశాలు తీవ్రమైన అసంతృప్తికి గురయ్యారు. దీనికి తోడు? యూరప్‌పై కక్ష్యగట్టిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను "అతి త్వరలో" కలవనున్నానని డొనాల్డ్ ట్రంప్ అనడం.. అదీ, తమ భద్రతా ఆందోళనలను అస్సలు పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంపై యూరప్ నిప్పులు చేరుగుతోంది. అయితే, అమెరికాకు ఎదురెళ్లడానికి యూరప్ ఎలాంటి స్టెప్ తీసుకుంటుంది అనేది ఆసక్తిని రేపుతోంది. ఇప్పటికే, ఒత్తిడిలో ఉన్న యూరప్.. తమ రాజకీయ విభేదాలు, దేశీయ ఆర్థిక ఆందోళనలను పక్కనపెట్టి.. భద్రతా వ్యయాన్ని పెంచుతూ.. ఉక్రెయిన్ భవిష్యత్తుపై ఒకే తాటిపైకి ముందుకు వస్తాయా అన్నది చర్చనీయాంశమయ్యింది.ఉక్రెయిన్‌కు సాయంగా దళాలను పంపడం సాధ్యమేనా అనే సందేహాలు వస్తున్నాయి. ఉక్రెయిన్ వ్యవహారంలో మొదలైన చర్చల టేబుల్‌పై తమను తాము బలవంతంగా ఉంచుకోవడానికి యురోపియన్ యూనియన్ దేశాలు ప్రయత్నిస్తున్నాయా అనిపిస్తోంది. ఇక, డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీని తీసుకురాడానికి ప్రయత్నిస్తేనే.. బ్రిక్స్ దేశాలపై గుర్రుమన్న డొనాల్డ్ ట్రంప్.. అలాంటిది, యూరప్.. అమెరికాకు ఎదురెళితే.. ట్రంప్ ఏం చేస్తారో అనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో.. వచ్చే నాలుగేళ్లు.. యూరప్ వర్సెస్ ట్రంప్‌లా ప్రపంచ రాజకీయాలు మారాతాయా అనే డౌట్ వస్తోంది.ఇప్పటి వరకూ అమెరికాను అడ్డం పెట్టుకొని రష్యా దగ్గర కాలర్ ఎగరేస్తున్న యూరప్ దేశాలకు ఈ సందర్భం మరింత క్లిష్టంగా మారింది. అమెరికా అధ్యక్షుణ్ని యూరప్‌కు భాగస్వామి అని ఒప్పించడం అత్యవసరంగా మారింది. దానికి ఒక చిన్న అవకాశం కోసం వేచి చూస్తున్న యూరప్‌కు ట్రంప్ తీరు అడ్డంగా మారింది. అందుకే, పారిస్ సమావేశం ద్వారా ట్రంప్‌ను ఎలా తమ వైపుకు తిప్పుకోవాలా అనే ప్లాన్ చేస్తోంది యూరప్. ఇక, డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేసిన రెండు ప్రధాన అంశాలపై యూరప్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.ఉక్రెయిన్ పోరాటంతో సంబంధం లేకుండానే నాటో కూటమి దేశాలు జిడిపిలో రెండు శాతం మొత్తాలను నాటో కోసం ఖర్చు చేయాలని ఎప్పటి నుంచో యూరప్ పైన అమెరికా ఒత్తిడి తెస్తోంది. యూరప్ రక్షణకు అమెరికా ఎందుకు మూల్యం చెల్లించాలని మొదటిసారి అధికారంలో ఉన్నపుడే ట్రంప్ ప్రశ్నించారు. అయితే, రెండోసారి గద్దెనెక్కిన తర్వాత.. ఇప్పుడు కనీసం 5 శాతం నాటోపై కూటమి దేశాలు ఖర్చుచేయాలని అంటున్నారు. అయితే, ఇప్పటి వరకూ నాటో దేశాల రక్షణ ఖర్చును అమెరికా దాదాపు 3.5 శాతం పెడుతుంటే.. రష్యాతో సరిహద్దును పంచుకునే పోలండ్, బాల్టిక్ దేశాలు కూడా తమ సైనిక బలగాలపై రెండు శాతాన్ని మించి ఖర్చు చేస్తున్నాయి.నాటోలో ప్రస్తుతం 32 సభ్యదేశాలు ఉన్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనానంతరం తూర్పు యూరప్‌లోని అనేక దేశాలు నాటో కూటమిలో చేరాయి. అల్బేనియా, బల్గేరియా, హంగరీ, పోలండ్, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, రొమేనియా, లిథువేనియా, లాత్వివా, ఈస్టోనియా దేశాలు నాటో పంచన చేరాయి. ఇక, ఉక్రెయిన్ మీద రష్యా దండయాత్ర తర్వాత 2022లో స్వీడన్, ఫిన్లాండ్ నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. దశాబ్దల తరబడి ఈ రెండు దేశాలు తటస్థంగా ఉన్నాయి. ఇక, రష్యాతో 13 వందల 40 కిలోమీటర్ల పొడవున సరిహద్దు కలిగిన ఫిన్లాండ్ 2023లో నాటోలో చేరింది.ఇక, 2024లో స్వీడన్ కూడా చేరింది. అయితే, స్వీడన్ చేరికను మొదట టర్కీ, హంగరీ వ్యతిరేకించినా చివరకు అంగీకరించాయి. స్వీడన్, ఫిన్లాండ్ చేరడం వల్ల 1990 తర్వాత నాటో భారీ విస్తరించినట్లయ్యింది. ఈ రెండు దేశాల నుంచి మిత్రరాజ్యాల సైన్యానికి మూడు లక్షల మంది సైన్యం జత కలిసినట్టయింది. ఇక, ఉక్రెయిన్, బోస్నియా, హెర్జ్‌గోవ్నియా, జార్జియా కూడా త్వరలో నాటోలో చేరడానికి ఆరాటపడుతున్నాయి.ట్రంప్ ప్రెసిడెంట్‌గా రెండోసారి పదవి చేపట్టిన తర్వాత.. పలు వివాదస్పద వ్యాఖ్యలతో ప్రపంచమంతా తనవైపు చూసేలా చేసుకున్నారు. ముందు, పనామా, మెక్సికో, కెనడాలను యునైటెడ్ స్టేట్స్‌లో చేర్చుకుంటామని చెప్పారు. అంత్య కీలక వ్యూహాత్మక ప్రాంతమైన గ్రీన్ లాండ్‌ను ఆక్రమించుకుంటానని కూడా అన్నారు. అయితే, ప్రస్తుతం ఐరోపా దేశమైన డెన్మార్క్ ఆధీనంలో ఉన్న గ్రీన్ లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అంత సులువైన పని కాదు. ఇప్పుడు.. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన డెన్మార్క్, నాటో కూటమిలో సభ్యదేశంగా ఉన్న కెనడాలకు ట్రంప్ అంటే కాలిపోతోంది.

కాబట్టి యూరప్‌కు సొంత సైన్యం అవసరమని చాలా మంది అభిప్రాయపడుతున్నారనీ.. ఇప్పుడు ఆ టైం వచ్చిందని జెలెన్స్కీ అన్నారు. యూరప్, అమెరికా మధ్య ఉన్న చిరకాల బంధం ముగింపు దశకు చేరుకుందని, ఈ విషయాన్ని యూరప్ దేశాలు అర్థం చేసుకోవాలని ఇటీవల అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల్ని జెలన్స్కీ మ్యూనిచ్‌లో జరిగిన భద్రత సదస్సుల్లో గుర్తు చేశారు. ఇక, శిక్షణా విన్యాసాల సాకుతో రష్యా తన మిత్రదేశమైన బెలారస్‌కు సైన్యాన్ని పంపాలని యోచిస్తోందని.. ఇది నాటో దేశాలకు ప్రమాదమని హెచ్చరించారు.అయితే, ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరడంలో విఫలమైతే దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సి ఉంటుందన్నారు ప్రెసిడెంట్ జెలెన్స్కీ. అమెరికా సైనిక మద్దతు లేకుండా తమ దేశం రష్యాను ఎదుర్కోలేదని ఒప్పుకున్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో తమకు ట్రంప్, సైనిక సహాయాన్ని అపివేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్, జెలెన్ స్కీలతో ఫోన్‌లో మాట్లాడారు., ఉక్రెయిన్ విషయంలో రష్యాతో శాంతి చర్చలకు సిద్ధపడిన ట్రంప్.. యూరప్‌ను రెచ్చగొట్టే విధంగా ఒక పనిచేశారు. శాంతి పరిష్కారంలో భాగంగా ఏ దేశాలు ఉక్రెయిన్‌కు దళాలను మోహరించడానికి సిద్ధంగా ఉంటాయి..? రష్యాపై ఆంక్షలను పెంచడానికి ఏ ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటాయి..? వాటిలో ఇప్పటికే ఉన్న వాటిని మరింత కఠినంగా అమలు చేయడం వంటి ఆరు అంశాలపై ప్రశ్నలతో కూడిన ఒక పత్రాన్ని అమెరికా యూరోపియన్ మిత్రదేశాలకు పంపింది. అయితే, నాటోలో అమెరికా రాయబారిగా ఉన్న జూలియాన్ స్మిత్ దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి సంక్లిష్టమైన దౌత్య పనికి సాధారణంగా వారాల తరబడి సమావేశాలు జరుగుతాయనీ.. ఇలా ప్రశ్నాపత్రాలు నింపినంత మాత్రాన పరిస్థితిని చక్కదిద్దడం సాధ్యం కాదని అన్నారు.ఇక, పారిస్‌లో యూరప్ నాయకులు ఏది సాధించినా, ఉక్రెయిన్‌పై చర్చల్లో సీటు సాధించకపోతే.. అది యూరప్ సూసైడ్ చేసుకున్నట్లే అనుకోవాలి. ఇప్పుడు యూరప్ ముందున్న దారి? చివరి నిర్ణయం తీసుకోడమే. ముఖ్యంగా, భద్రతా పరంగా ఉక్రెయిన్ నుండి.. లేకపోతే.. యూరప్ నుండే దూరంగా ఉండాలని అమెరికా ప్లాన్ చేస్తే.. యూరప్ కచ్చితంగా తమ రక్షణ కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. తమ సైన్యాన్ని పెంచుకోవాలి. ఎందుకంటే, అమెరికా అడ్డులేకపోతే? రష్యాను ఆపడం ఎవరి తరం కాదు. దానికి, యూరప్ ఎప్పుడూ అప్రమత్తంగానే ఉండాలి.



# ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయం.. అంగ్ కోర్ వాట్. ఎక్కడుందో, ప్రత్యేకతలేమిటో తెలుసా?

500 ఎకరాల విస్తీర్ణం.. 65 మీటర్ల ఎత్తయిన భారీ శిఖరం.. చుట్టూ మరిన్ని శిఖరాలతో కూడిన ఆలయ సముదాయం.. అద్భుతమైన శిల్పకళ.. పచ్చని కళతో, నీటి గలగలలు.. ఇవన్నీ ప్రపంచంలోనే అత్యంత పెద్ద దేవాలయమైన అంగ్ కోర్ వాట్ ప్రత్యేకతలు. వందల ఏళ్ల కిందటి ఈ అద్భుత దేవాలయం ఉన్నది భారతదేశంలో మాత్రం కాదు.. కాంబోడియాలో. ఎన్నో వింతలకు, అద్భుతమైన విశేషాలకు నిలయమైన ఈ అంగ్ కోర్ వాట్ దేవాలయం గురించి తెలుసుకుందామా..

**మన కాంభోజ రాజ్యం**

ప్రస్తుతం కాంబోడియాలో ఉన్న అంగ్ కోర్ వాట్ ఆలయం.. క్రీస్తుశకం వెయ్యో శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత ఖ్మేర్ సామ్రాజ్యంలో భాగం. ఆ సామ్రాజ్యం రాజధాని నగరం పేరు కూడా అంగ్ కోర్. తొలుత ఈ సామ్రాజ్యాన్ని ఇతరులు పాలించినా.. అనంతరం హిందూ రాజుల పరిపాలనలోకి వచ్చింది. దీనిని కాంభోజ రాజ్యంగా పేర్కొనేవారు. యురోపియన్ల వలసల అనంతరం కాంబోడియాగా మారింది. అంగ్ కోర్ వాట్ ఆలయాన్ని నిర్మించిన రాజు పేరు సూర్యవర్మన్-2. ఆయన విష్ణుమూర్తి ఆరాధకుడు.

**ప్రపంచంలోనే అతి పెద్ద నగరం కూడా..**

అంగ్ కోర్ నగరంలో అప్పట్లోనే ఇక్కడ పది లక్షల మంది వరకు నివసించినట్టు చరిత్ర పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఆ లెక్కన 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం వచ్చే నాటికి కూడా ప్రపంచంలో అతిపెద్ద నగరం అంగ్ కోర్ అని చెప్పవచ్చు. ముఖ్యంగా కేవలం నగర ప్రధాన ప్రాంతంలోనే ఏకంగా 5 లక్షల మంది నివసించినట్టుగా గుర్తించారు. అంగ్ కోర్ వాట్ కు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో 'మహేంద్ర పర్వత'గా పిలిచే మరో పెద్ద నగరం అవశేషాలను కూడా గుర్తించారు. ప్రస్తుతం అంగ్ కోర్ వాట్ ప్రాంతాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించి రక్షిస్తోంది.

**ఆలయాల నగరం..**

అంగ్ కోర్ వాట్ ను కేవలం ఒక్క దేవాలయంగా చెప్పలేం. ఇక్కడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని వందల దేవాలయాలు ఉన్నాయి. అసలు అంగ్ కోర్ వాట్ అంటేనే.. దేవాలయాల నగరం అని అర్థం. క్రీస్తు శకం 1113 సంవత్సరం నుంచి 1150 సంవత్సరాల మధ్య దీనిని నిర్మించినట్టు చరిత్రకారులు నిర్ధారించారు. ఇది సుమారు 500 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రపంచంలోనే అన్ని మతాలకు సంబంధించి కూడా అంగ్ కోర్ వాట్ దేవాలయం అతిపెద్దది కావడం గమనార్హం.

**మేరు పర్వతాన్ని తలపించేలా..**

హిందూ పురాణాల్లో పేర్కొన్న మేరు పర్వతాన్ని తలపించేలా అంగ్ కోర్ వాట్ దేవాలయాన్ని నిర్మించారు. హిమాలయాల అవతల ఉండే మేరు పర్వతం దేవతల నివాసంగా పురాణాలు పేర్కొన్నాయి. అంగ్ కోర్ వాట్ ప్రధాన దేవాలయంపై మధ్యలో 213 అడుగుల (65 మీటర్ల) ఎత్తయిన భారీ గోపురంతోపాటు దానికి నాలుగు పక్కలా కొంత చిన్నగా మరో నాలుగు గోపురాలు ఉన్నాయి. ప్రధాన ఆలయానికి చుట్టూ పలు చిన్న ఆలయాలు ఉన్నాయి.

- దేవాలయం చుట్టూ అతిపెద్ద నీటి కందకం ఉండటం ఈ ఆలయ విశేషాల్లో ఒకటి. ఏకంగా 650 అడుగుల (200 మీటర్లు) వెడల్పుతో 13 అడుగుల (నాలుగు మీటర్ల) లోతుతో ఆలయం చుట్టూరా ఉన్న ఈ కందకం ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. దీని మొత్తం చుట్టుకొలత ఏకంగా ఐదు కిలోమీటర్లకు పైనే ఉండడం గమనార్హం.
- ఆలయానికి పశ్చిమ, తూర్పు దిశల్లో ప్రవేశ మార్గాలు ఉన్నాయి. ప్రవేశించే చోట రాజగోపురాలు ఏర్పాటు చేశారు. ఇందులో పశ్చిమ ద్వారాన్ని ప్రధాన ద్వారంగా భావిస్తారు. ఈ ద్వారానికి ఇరువైపులా గంభీరంగా సింహాల శిల్పాలు ఉంటాయి. ద్వారం నుంచి ప్రధాన ఆలయం వరకు రాతి కట్టడంతో మార్గాన్ని ఏర్పాటు చేశారు.
- ఆలయం ప్రహరీ గోడ లోపలే పలు నీటి మడుగులు కూడా ఉండటం గమనార్హం.
- ప్రధాన గోపురం కింది గదుల్లో అద్భుతమైన పెయింటింగులు ఉన్నాయి. ఖ్మేర్ సామ్రాజ్యం నాటి పరిస్థితులతో పాటు రామాయణ, మహాభారత గాథలకు సంబంధించిన దృశ్యాలను వాటిల్లో చిత్రించారు.
- అంగ్ కోర్ వాట్ ఆలయం పక్కన 12వ శతాబ్దం నాటికి చెందిన అతిపెద్ద ఇసుక రాతి నిర్మాణాన్ని పరిశోధకులు గుర్తించారు. వృత్తాకారపు ఆకృతులతో ఉన్న ఆ నిర్మాణం ఏమిటన్నది ఇప్పటికీ నిర్ధారించలేదు.

**బౌద్ధారామంగా మారిన విష్ణుమూర్తి ఆలయం**

అంగ్ కోర్ వాట్ ప్రధానంగా విష్ణుమూర్తి ఆలయం. ప్రధాన ఆలయంలోని అతిపెద్ద రాజగోపురం కింద ఉన్న గదిలో భారీ విష్ణుమూర్తి విగ్రహం ఉంటుంది. అయితే ఖ్మేర్ సామ్రాజ్య పతనం అనంతర కాలంలో కాంబోడియాలో బౌద్ధం పరివ్యాప్తమైంది. ఆ సమయంలోనే.. అంటే సుమారు 14వ శతాబ్దం సమయంలో అంగ్ కోర్ వాట్ ఆలయాన్ని బౌద్ధారామంగా మార్చే ప్రయత్నం జరిగింది. అంగ్ కోర్ వాట్ లో అప్పటి ఉన్న శిల్పాలను, ఆలయాలను ఏమాత్రం మార్చకుండే కేవలం బుద్ధుడి ప్రతిమలను మాత్రం అదనంగా ఏర్పాటు చేశారు. తద్వారా అంగ్ కోర్ వాట్ ఆలయ రూపు దెబ్బతినకుండా ఉంది.

# ఔషధ గుణాల రోజా....ఆరోగ్యానికి రాజా



*చూడగానే ఎంతో అందంగా కన్పించే రోజా పూలకు ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అవి అందానికే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు. రోజా రేకులను తినడం వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం...*

వీర్యవృద్ధి : రోజా రేకులు మీ శృంగార జీవితానికి చాలా దోహదం చేస్తాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, రోజా రేకులను రోజూ గుప్పెడు తింటూ వస్తే అవి మన శరీరంలోని దోషాలను పోగొడుతాయి. తద్వారా రక్తశుద్ధి జరుగుతుంది. అంతేకాక సహజంగానే వీటికి వీర్యవృద్ధిని కలిగించే గుణముంది.

మొటిమలు, నల్లమచ్చలు మటుమాయం : యుక్త వయసులో హార్మోన్ల ప్రభావంతో యువతీయువకులకు మొహంపై వచ్చే మొటిమలు, తద్వారా ఏర్పడే నల్లమచ్చలను పోగొట్టడంలో రోజా రేకులు సమర్థవంతంగా పనిచేస్తాయి. రేకులను నీటిలో బాగా మరిగించాలి. తర్వాత వాటిని బయటకు తీసి ముద్దగా నూరాలి. దీనికి ముల్తానీ మట్టి కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో ఒక్కసారి మీ మొహంపై రాసుకుంటే సత్ఫలితం ఉంటుంది. క్రమేపీ నల్లమచ్చలు తగ్గిపోవడం మీరు గుర్తించవచ్చు. అంతేనా...రోజా రేకులు మీ మొహ చర్మాన్ని ఆరోగ్యవంతంగా కూడా ఉంచడంలో ఇవెంతగానో దోహదపడతాయి.రోజా రేకుల కషాయం : రోజా రేకులతో తయారు చేసే కషాయం కూడా ఆరోగ్యానికి మంచిదే. మార్కెట్లలో లభించే ఔషధాల కంటే కూడా ఇది బాగా పనిచేస్తుంది. మీ చర్మానికి మెరుపును అందిస్తుంది. చర్మంపై ప్రధానంగా మొహంపై మొటిమల వల్ల ఏర్పడిన కూపములను ఇది తగ్గిస్తుంది. దీనిని మీరు మీ ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. మీకు కావాల్సిందల్లా రోజా రేకులు, నీరు మాత్రమే.


మనసుకు ప్రశాంతత : రోజా పూల నుండి వచ్చే సువాసనను ఆస్వాదించడం వల్ల మీకు శారీరకంగానే కాక మీ మనసుకు కూడా ప్రశాంతత చేకూరుతుంది. ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి దోహదపడుతుంది. వేడి నీటిలో రోజా రేకులతో పాటు కొంత బాత్ సాల్ట్‌ని కలిపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పద్ధతి ప్రకారం, మీరు గనుక పీల్చితే తప్పకుండా ఉపశమనం లభించి, చురుగ్గా మారుతారు.

నాజూకుతనానికి : రోజా రేకుల్లో ఉండే పదార్థాలు నాజూకుతనానికి బాగా ఉపయోగపడుతాయి. కొద్దిగా మెంతులు, రోజా రేకులు కలిపి చేసుకున్న పేస్టును తినడం లేదా రోజా రేకులతో కాచిన కషాయాన్ని తాగినా మీరు సన్నబడతారు. అంతేకాక రోజా రేకులు జీవక్రియను మెరుగుపరుస్తాయి. తద్వారా మీరు సన్నబడే అవకాశముంటుంది.

# స్టార్ కిడ్స్ ఎందుకిలా తేలిపోతున్నారు?

ఇటీవలే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ కుమారుడు జునైద్– శ్రీదేవి కుమార్తె ఖుషి కపూర్ జంటగా నటించిన 'లవ్ యాపా' విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ గా నిలిచింది. పెద్ద స్టార్ల నటవారసులు నటించినా ఈ సినిమాకి ఆశించిన బజ్ రాలేదు. రిలీజ్ ముందు లవ్ యాపాకు కనీస హైప్ రాలేదు. చివరికి బాక్సాఫీస్ వద్ద ఫలితం నిరాశపరిచింది.ఇప్పుడు మరో పెద్ద స్టార్ సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ సినిమా 'నాదానియాన్' పరిస్థితి ఇందుకు విరుద్ధంగా లేదని అర్థమవుతోంది. ఇబ్రహీం సరసన 'లవ్ యాపా' బ్యూటీ ఖుషీ కపూర్ కథానాయికగా నటించింది. ఇప్పుడు ఖుషీకి వరుసగా మరో ఫ్లాప్ రెడీగా ఉందంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. మార్చి 7న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానున్న "నదానియన్' సినిమా గురించి పెద్దగా ప్రచారం కూడా చేయకపోవడం ఆశ్చర్యపరుస్తోంది.ప్రచారం లేకుండా ఏ సినిమా ప్రజలకు చేరువ కాదు. అలాగే పాటలు టీజర్ వంటి వాటికి ఆశించిన బజ్ రాలేదు. దీంతో ఈ సినిమా విజయంపై నమ్మకం లేదని పెదవి విరిచేస్తున్నారు. నిజానికి సౌత్ లోని అగ్ర హీరోల వారసుల సినిమాలకు ఉండే సహజసిద్ధమైన క్యూరియాసిటీ హిందీ స్టార్ల పిల్లలకు ఉండటం లేదు. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ల నటవారసులకు కనీస ఆరంభ వసూళ్లకు కూడా హామీ లేదు. మంచి టాక్ వచ్చినా కానీ, జనం థియేటర్లకు వస్తారా? అన్న గ్యారెంటీ కూడా కనిపించకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. 'ది ఆర్చీస్'తో తెరకు పరిచయమైన స్టార్ కిడ్స్ విషయంలోను జీరో బజ్ నిజంగా ఆశ్చర్యపరిచింది.అమీర్ ఖాన్, సైఫ్ ఖాన్ దశాబ్దాలుగా బాలీవుడ్ ని ఏలుతున్న హీరోలు. స్వయంకృషి, హార్డ్ వర్క్ తో శాసించే స్థాయికి ఎదిగారు. భారీ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించారు. కానీ వారి పిల్లలు లెగసీని ముందుకు తీసుకెళ్లగలరా? అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. అయితే సైఫ్ ఖాన్ కుమారుడు నటిస్తున్న మొదటి సినిమాతోనే అతడు స్టార్ అవుతాడా లేదా? అన్నది నిర్ణయించలేం. అతడు తన తదుపరి చిత్రం సర్జమీన్ తోను లక్ చెక్ చేసుకోబోతున్నాడు. ఈ సినిమాలో కాజోల్ వంటి పెద్ద స్టార్ అండదండలు అతడికి ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు.





**శ్రీముఖి యొక్క పూల్‌సైడ్ పోజ్: గ్లామర్ యొక్క స్ప్లాష్**



**దిశా పటానీ యొక్క తాజా లుక్: చీరలో స్టైలింగ్‌లో మాస్టర్ క్లాస్**

## టాలీవుడ్‌లో ఈ ముద్దుగుమ్మలు కనిపించరా?



ఎక్కడ అయినా కొత్త నీరు వస్తుంటే పాత నీరు అనేది వెళ్లి పోతుంది. సినిమా ఇండస్ట్రీలోనూ అదే జరుగుతుంది. దాదాపు వందేళ్లుగా ఎంతో మంది కొత్త వాళ్లు ఎంట్రీ ఇవ్వడం, అదే స్థాయిలో పాత వారు కనుమరుగు కావడం మనం చూస్తూ వస్తున్నాం. కొద్ది మంది మాత్రమే ఇండస్ట్రీలో అలా పాతుకు పోతూ ఉంటారు. కొద్ది మంది హీరోలు నాలుగు అయిదు దశాబ్దాలు అయినా ఇండస్ట్రీలో కొనసాగుతూ వస్తున్నారు. కొందరు హీరోయిన్స్ సైతం అప్పట్లో హీరోయిన్స్‌గా నటించి, ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటిస్తున్నారు. కొన్నాళ్ల తర్వాత వారు కూడా కనుమరుగు కానున్నారు. అయితే కొద్ది మంది హీరోయిన్స్ మాత్రం ఉన్నట్లుండి కనుమరుగు అవుతున్నారు.

టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్స్‌గా మొన్నటి వరకు వెలుగు వెలిగిన పలువురు హీరోయిన్స్ ఇకపై కనిపించే అవకాశాలు లేవని, ఒకవేళ చేసినా చిన్నా చితక సినిమాల్లో మాత్రమే వారు కనిపించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా సమంత ఈ జాబితాలో ముందు వరుసలో ఉంటుంది. టాలీవుడ్‌లో ఈ అమ్మడు సుదీర్ఘ కాలం పాటు టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. ఈమధ్య కాలంలో బాలీవుడ్‌లో వరుసగా వెబ్ సిరీస్‌లు, సినిమాలు చేస్తున్న కారణంగా తెలుగులో సినిమాలు చేయడం లేదు. ఒకటి రెండు సినిమా ఆఫర్లు వచ్చినా సమంత వాటిని సున్నితంగా తిరస్కరించిందట. ముందు ముందు సైతం టాలీవుడ్‌లో ఆమె నటించే అవకాశాలు కనిపించడం లేదు.పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో సినిమాలు చేయాలని ఆశ పడింది. కానీ కాజల్‌కి టాలీవుడ్‌లో ఆఫర్లు పెద్దగా రావడం లేదు. ఒకటి రెండు సినిమాల్లో నటించిన పెద్దగా అవి వర్కౌట్ కావడం లేదు. సినిమా ఇండస్ట్రీ నుంచి ఆమె మెల్ల మెల్లగా దూరం జరుగుతుందని తెలుస్తోంది. చిన్నా చితకా ఆఫర్లు వస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదని తన ఇమేజ్‌కి తగ్గట్లు ఆఫర్లు వస్తేనే నటించేందుకు ఆసక్తిని కనబర్చుతుంది. కనుక కాజల్ అగర్వాల్‌కి టాలీవుడ్‌లో కాలం చెల్లినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ సైతం టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేయడం లేదు. ఆమెకు యంగ్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు రావడం లేదు, సీనియర్ హీరోల సినిమాల్లో ఆమె నటించేందుకు ఆఫర్లు దక్కించుకోవడం లేదు. అందుకే శృతి హాసన్ రాబోయే రోజుల్లో టాలీవుడ్ నుంచి కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయి. వీరు మాత్రమే కాకుండా పలువురు హీరోయిన్స్ సైతం టాలీవుడ్ నుంచి దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఉప్పెన సినిమాతో కృతి శెట్టి టాలీవుడ్‌లో అడుగు పెట్టి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంది. కానీ అంతలోనే ఈ అమ్మడికి ఆఫర్లు తగ్గాయి. ప్రస్తుతం ఈమె చేతిలో సినిమాలు ఏమీ లేవు. కీర్తి సురేష్‌కి తెలుగులో పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ఈమె సైతం మెల్ల మెల్లగా టాలీవుడ్‌కి దూరం అయ్యేలా ఉంది. పూజా హెగ్డే సైతం కొన్ని సంవత్సరాల పాటు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా నిలిచింది. కానీ టాలీవుడ్‌లో ఈమె పరిస్థితి బాగాలేదు. ఈమెకు టాలీవుడ్‌లో ఆఫర్లు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే రకుల్ ప్రీత్ సింగ్, తమన్నా, రెజీనా ఇంకా ఇతర హీరోయిన్స్ సైతం ఇండస్ట్రీకి దూరం అవుతున్నారు.